# ప్రజా పిలుపు

RNI-TGBIL/25/A1275

ప్రజల గొంతు - ప్రజల కోసం

PEOPLE VOICE

PRAJA PILUPU

RNI:TGTEL/26/A5230

ప్రజా పిలుపు NEWS TV

నిజం మా ధ్యేయం.. ప్రజలే మా బలం

LIVE

WEB TV | MOBILE APP | DIGITAL NEWS

SANGAREDDY సంపుటి (Volume) :02 సంచిక (Issue) :12 ఎడిటర్ :కె విజయ్ కుమార్ పేజీలు : 08, వెల. 2రూ/ గురువారం- 24- సెప్టెంబర్ - 2026


### 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత రాష్ట్రాలకు

## కొత్త ఇంచార్జ్‌లను నియమించిన బీజేపీ అధిష్ఠానం

- ఏపీ బీజేపీ ఇంచార్జ్‌గా అర్వింద్ భదౌరియా
- తెలంగాణ ఇంచార్జ్‌గా సునీల్ భన్సల్
- ఒడిశా ఇంచార్జ్‌గా పురందేశ్వరి



హైదరాబాద్: రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు, సహ-ఇంచార్జ్‌ల జాబితాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు. తెలంగాణ: సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ-ఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు). ఆంధ్రప్రదేశ్: అర్వింద్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ-ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. తమిళనాడు: రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా, కో-ఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురాణా బాధ్యతలు చేపట్టనున్నారు. ఒడిశా: దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ-ఇంచార్జ్‌గా నియమితులయ్యారు. కర్ణాటక: హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ-ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఉత్తర ప్రదేశ్: దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి మిగతా..2లో

## ఎంపిక కమిటీ పిటిషన్‌పై భిన్నాభిప్రాయంతో సుప్రీం తీర్పు- వేర్వేరు ఉత్తర్వులు జారీ



ఎన్నికల కమిషనర్ల చట్టం-2023 రాజ్యాంగబద్ధతపై భిన్నాభిప్రాయంతో తీర్పు


ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనంలో వ్యక్తమైన భిన్నాభిప్రాయాలు

ఢిల్లి : ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని మిగతా..2లో

### సర్‌పై నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే

## ఎలాంటి అనుమానాలొద్దు: ఈసీ

- ఎస్ఐఆర్ నిర్ణయాలపై ఇద్దరు ఈసీ సభ్యులు 14 సార్లు అభ్యంతరాలు తెలిపారన్న మీడియా కథనం
- ఈసీ తీరుపై కాంగ్రెస్, సీపీఎం విమర్శలు
- రాజకీయ పార్టీల విమర్శలపై క్లారిటీ ఇచ్చిన ఈసీ
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్




హైదరాబాద్ : దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ ఐఆర్ )లో పలు రాష్ట్రాల్లో ఓటర్ల పేర్ల తొలగింపుపై ఎన్నికల కమిషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన మీడియా కథనంపై ఎన్నికల సంఘం (ఈసీ) స్పందించింది. కమిషన్ జారీచేసే అన్ని అధికారిక ఆదేశాలు, నిర్ణయాలు, పరిపాలనాపరమైన సూచనలకు పూర్తి చట్టబద్ధత ఉంటుందని వెల్లడించింది. సర్ ప్రక్రియపై నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే అని, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలకుతావులేదని ఈసీ తెలిపింది. ఇవన్నీ ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం నిర్దేశించిన చట్టబద్ధమైన విధానాల ప్రకారమే జరుగుతాయని తెలిపింది. అయితే, ఏ సంస్థలోనైనా నిర్ణయాలు తీసుకునే ముందు జరిగే చర్చల్లో భిన్నాభిప్రాయాలు సాధారణమేనని పేర్కొంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో తన రాజ్యాంగవిధులను పూర్తి చిత్తశుద్ధితో నిర్వర్తించేందుకు కట్టుబడి ఉన్నట్లు ఈసీ పునరుద్ఘాటించింది. ముసాయిదా దశలో కమిషన్ సభ్యులు మిగతా..2లో

### రైతుల పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చింది: జూరాల నీటి విడుదలపై కేటీఆం




- జూరాల కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేసిన ప్రభుత్వం
- పోరాడితో పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప అన్న కేటీఆర్
- రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం దిగొచ్చిందని వ్యాఖ్య

హైదరాబాద్: జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు అధికారులు నీటిని విడుదల చేసిన పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. "పోరాడితే పోయేదేమీ లేదు.. బానిస సంకెళ్లు తప్ప" అనే ప్రసిద్ధ నినాదాన్ని గుర్తుచేస్తూ... తమ హక్కుల సాధన కోసం రోడ్డెక్కిన పాలమూరు అన్నదాతల పోరాట పటిమ గొప్పదని కొనియాడుతూ సోషల్ మీడియా వేదికగా ట్వీట్ చేశారు. కాలువలకు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్న విపత్కర పరిస్థితుల్లో

# తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

## రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్


- సీఎస్‌తో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశం
- అక్టోబర్ జీతంతో మొదటి డీఏ చెల్లింపు
- ఉగాది సందర్భంగా రెండో డీఏ విడుదల
- చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు
- పీఆర్సీపై ఇంకా నిర్ణయం ప్రకటించని ప్రభుత్వం



అమరావతి : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు తీపి కబురు చెప్పింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించిన అనంతరం రెండు డీఏలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ప్రభుత్వం ఆమోదించిన రెండు డీఏల్లో మొదటిదాన్ని అక్టోబర్ నెల జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లించనుంది. దీంతో చాలాకాలంగా డీఏ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఊరట లభించనుంది. రెండో డీఏను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో రెండు విడతల్లో ఉద్యోగులకు డీఏ ప్రయోజనం అందనుంది. అయితే డీఏలపై నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఉద్యోగులు కోరుతున్న పీఆర్సీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఉద్యోగ సంఘాలు పీఆర్సీ అమలు కోసం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం డీఏలకే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. పీఆర్సీపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది.

### రేవంత్ రెడ్డికి నెల రోజుల

## డెడ్ లైన్ విధించిన కవిత




- ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత
- ఐదుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోతే రేవంత్ కు పరామర్శించే సమయం కూడా లేకపోయిందని మండిపాటు
- నెల రోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని హెచ్చరిక

హైదరాబాద్: ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న ఏసీ పేలుడు మిగతా..2లో

## జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బొత్స అనూష




భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా అనూష నియామకం

తనకు నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన జగన్‌కు ధన్యవాదాలు తెలిపిన అనూష

ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలపై పోరాడతానని వ్యాఖ్య

అమరావతి : వైసీపీ అధినేత జగన్‌ను భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ నూతన సమన్వయకర్త బొత్స అనూష మర్యాదపూర్వకంగా కలిశారు. మిగతా..2లో

## భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్.. ఊడిపడిన ప్లాస్టరింగ్



హైదరాబాద్‌లో భారీ వర్షాల కారణంగా చార్మినార్‌కు స్వల్ప నష్టం

లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడిపడిన వైనం

మరమ్మతుల కోసం ఇప్పటికే టెండర్ ప్రక్రియలో ఉందని ఏఎస్ఐ వెల్లడి

శనివారం వరకు భారీ వర్ష సూచనతో అప్రమత్తమైన అధికారులు

హైదరాబాద్: భాగ్యనగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చారిత్రక కట్టడం చార్మినార్ స్వల్పంగా దెబ్బతింది. మంగళవారం రాత్రి పాతబస్తీలో సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వానకు లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న చార్మినార్ భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, కిందపడిన ప్లాస్టరింగ్ శకలాలను తొలగించారు. మిగతా..2లో

### అక్టోబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు..

## కూటమి క్లీన్ స్వీప్ చేయాలి

### మంత్రుల భేటీలో నారా లోకేశ్




- స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్న లోకేశ్
- ఎన్నికలు జరగవనే అపోహలు ఎవరికీ వద్దని వ్యాఖ్య
- ఉపాధ్యాయులపై దాడి చేసిన వారు పరారయ్యారని ఎద్దేవా

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వం పూర్తి సన్నద్ధంగా ఉందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. విజయవాడలో పలువురు మంత్రులతో

## పవన్‌కు చంద్రబాబు ఆత్మీయ పరామర్శ

## చికిత్సలోనూ సమీక్షలు చేయడంపై ప్రశంసలు

కేరళలో ఆయుర్వేద చికిత్స ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆత్మీయ స్వాగతం పలికారు.




అమరావతి : కేరళంలో ఆయుర్వేద చికిత్స ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆత్మీయ స్వాగతం పలికారు. సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి హాజరైన పవన్‌ను సీఎం ప్రత్యేకంగా పలకరించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ యోగక్షేమాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. భుజం నొప్పికి ఆయుర్వేద వైద్యం : గత కొంతకాలంగా పవన్ కల్యాణ్ తీవ్రమైన భుజం నొప్పితో బాధపడుతున్న విషయం తెలిసిందే. దీని నుంచి ఉపశమనం పొందేందుకు ఆయన ఇటీవల కేరళం వెళ్లారు. కొన్ని వారాల పాటు కేరళలోని ప్రముఖ 'డాక్టర్ సీతారామ్ ఆయుర్వేదిక్ రీట్రీట్'లో ప్రత్యేక ఆయుర్వేద చికిత్స తీసుకున్నారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం పూర్తిగా కుదుటపడటంతో పాలనా వ్యవహారాలపై దృష్టి సారించి మంత్రివర్గ సమావేశానికి హాజరయ్యారు. పవన్ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న సీఎం, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో మిగతా..2లో

### రాత్రికి తీరం దాటనున్న తీవ్ర వాయుగుండం

## ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్

- పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది.
- దీని ప్రభావంతో శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం సమీపంలో రాత్రి 8-12 మధ్య తీరం దాటే అవకాశం ఉందని విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది.
- పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం



ఢిలి: పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. దీని ప్రభావంతో నేడు శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం సమీపంలో రాత్రి 8-12 గంటల మధ్య తీరం దాటే అవకాశం ఉందని విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. తీరం దాటేటప్పుడు గంటకు 50-70 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వేచే అవకాశం ఉందని హెచ్చరించింది. అలాగే నదీ పరీవాహక ప్రాంతాల్లో ఫ్లాష్ ఫ్లడ్‌కు ఆస్కారం ఉందని వెల్లడించింది. లోతట్టుప్రాంత మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## పవన్‌కు చంద్రబాబు ఆత్మీయ పరామర్శ
## చికిత్సలోనూ సమీక్షలు చేయడంపై ప్రశంసలు

తిరిగి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా : చికిత్స అనంతరం తొలిసారిగా పవన్ కల్యాణ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆయనను ఆత్మీయంగా పరామర్శించారు. వైద్యానికి సంబంధించిన వివరాలు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోలుకుని, రెట్టించిన ఉత్సాహంతో తిరిగి ప్రజాసేవలో నిమగ్నం కావడం పట్ల డిప్యూటీ సీఎంను చంద్రబాబు మనస్ఫూర్తిగా అభినందించారు. చికిత్సలోనూ తగ్గని అంకితభావం : పవన్ కల్యాణ్ పనితీరును, అంకితభావాన్ని సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. కేరళంలో చికిత్స పొందుతున్న సమయంలోనూ పవన్ తన బాధ్యతలను ఏమాత్రం విస్మరించలేదని గుర్తుచేశారు. అక్కడి నుంచే తన శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారులతో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించడాన్ని సీఎం కొనియాడారు. ప్రజా సమస్యలపై పవన్ కల్యాణ్‌కు ఉన్న చిత్తశుద్ధికి, విధుల పట్ల ఆయన కనబరుస్తున్న అంకితభావానికి ఇదే నిదర్శనమని చంద్రబాబు ప్రశంసించారు.

## అక్టోబర్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు.. కూటమి క్లీన్ స్వీప్ చేయాలి: మంత్రుల భేటీలో నారా లోకేశ్

నిర్వహించిన ప్రత్యేక బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ నెలలోనే స్థానిక ఎన్నికలు జరుగుతాయని... ఎన్నికలు జరగవనే ఎలాంటి అపోహలు ఎవరికీ వద్దని ఈ సందర్భంగా కూటమి శ్రేణులకు ఆయన స్పష్టతనిచ్చారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా వేగంగా పరిష్కరించుకుని, అన్ని స్థానాల్లో సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. స్థానిక పోరులో కూటమి అభ్యర్థుల విజయం కోసం ప్రజాప్రతినిధులు, నాయకులు సన్నద్ధం కావాలని, సీట్ల అంశంపై కూటమి సమన్వయ కమిటీ, అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకుంటాయని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాలు ఒక్కొక్కటిగా ఆధారాలతో బయటకు వస్తుండటంతో, ప్రజల దృష్టిని మళ్లించేందుకు 'గొడ్డలి పార్టీ' నిరుద్యోగులకు ఎంతో మేలు చేసిన మెగా డీఎస్సీపై నిందలు వేస్తోందని లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ శాప్ కార్యాలయం వద్ద క్రీడా కోటా ఉపాధ్యాయులపై గూండాలతో దాడులు చేయించి మీసాలు మెలేసిన వారు, పోలీసులు చట్టప్రకారం కేసులు నమోదు చేయగానే పరారయ్యారని ఎద్దేవా చేశారు. గురువుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తుండటం శుభపరిణామమని వ్యాఖ్యానించిన మంత్రి లోకేశ్... వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రులను కోరారు. జలాశయాలను పూర్తిస్థాయిలో నింపుకోవడానికి ఈ వర్షాలు ఎంతో అనుకూలిస్తాయని పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

## 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత రాష్ట్రాలకు కొత్త ఇంచార్జ్‌లను నియమించిన బీజేపీ అధిష్ఠానం

జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ-ఇంచార్జ్‌లను కేటాయించారు. మహారాష్ట్ర: బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ-ఇంచార్జ్‌లుగా నియమించారు. ఛత్తీస్‌గఢ్ - హర్యానా: మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు. ఢిల్లీ: డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో-ఇంచార్జ్‌లుగా నియమించారు. గుజరాత్: తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు. హిమాచల్ ప్రదేశ్: శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు. మధ్యప్రదేశ్: మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

## రైతుల పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చింది
## జూరాల నీటి విడుదలపై కేటీఆర్

రైతులు చేసిన సమరశీల పోరాటం అత్యంత స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈ ప్రభుత్వాన్ని రైతులు ముల్లుగర్రతో తట్టి నిద్రలేపి, నీటిని విడుదల చేసేలా పరుగులు పెట్టించారని కేటీఆర్ ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ నిర్బంధాలను సైతం ఎదుర్కొని రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించడం, తెలంగాణ ప్రజల కనీస అవసరాలను తీర్చేలా ఈ ప్రభుత్వాన్ని పరుగులు పెట్టించడమే రాబోయే కాలంలో బీఆర్ఎస్ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. రైతుల ఉద్యమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చి నీటిని విడుదల చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

## జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బొత్స అనూష

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె జగన్ తో సమావేశమయ్యారు. ఇటీవలే భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుమార్తె అనూషను పార్టీ అధిష్ఠానం నియమించిన సంగతి తెలిసిందే. గతంలో ఇన్‌ఛార్జ్‌గా ఉన్న బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పార్టీని వీడటంతో, స్థానిక క్యాడర్‌ను ఏకతాటిపైకి తెచ్చి పార్టీని బలోపేతం చేసే బాధ్యతను జగన్ ఆమెకు అప్పగించారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో కీలక బాధ్యతను కట్టబెట్టినందుకు పార్టీ అధినేత జగన్‌కు అనూష ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భేటీ అనంతరం అనూష మాట్లాడుతూ... నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి, శ్రేణులను సమన్వయం చేస్తూ ముందుకెళ్లేందుకు శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేస్తానని చెప్పారు.

## భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్.. ఊడిపడిన ప్లాస్టరింగ్

మంగళవారం సాయంత్రం నగరంలో 37.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షం కారణంగానే మినార్ ప్లాస్టరింగ్ ఊడిపడి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు స్పందించారు. ఎడమవైపు మినార్ కింద ఉన్న గోడ వెలుపలి భాగం కొంత బలహీనపడటంతో భారీ వర్షానికి ప్లాస్టరింగ్ రాలిపోయిందని వారు తెలిపారు. దెబ్బతిన్న భాగానికి మరమ్మతులు నిర్వహించేందుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో అత్యధికంగా సంగారెడ్డిలో 82.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు, ఈ నెల 26వ తేదీ శనివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చార్మినార్‌తో పాటు ఇతర చారిత్రక కట్టడాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులు నిర్ణయించారు.

## 'వందేమాతరం పాడకపోతే...'
## సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు

వందేమాతరం గీతాన్ని ఆలపించలేదన్న కారణంతో వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మతపరమైన విశ్వాసాలు లేదా మనస్సాక్షికి సంబంధించిన కారణాలతో ఎవరైనా ఈ గీతాన్ని పాడటానికి నిరాకరిస్తే, వారిపై ఎటువంటి శిక్షార్హమైన చర్యలు ఉండబోవని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. అదే సమయంలో, జాతీయ గీతంగా వందేమాతరం హోదాను న్యాయస్థానాలు సమీక్షించలేవని కూడా స్పష్టం చేసింది. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలన్న కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్‌ను, అలాగే జాతీయ చిహ్నాలను అవమానించకుండా నిరోధించే చట్టం-2026 సవరణను టీఎం కృష్ణ సవాల్ చేశారు. గీతంలోని చివరి నాలుగు చరణాలలో హిందూ దేవతల ప్రస్తావన ఉండటం రాజ్యాంగబద్ధమైన లౌకిక స్ఫూర్తికి, మత స్వేచ్ఛకు విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ, "వందేమాతరం సుదీర్ఘ కాలంగా జాతీయ గీతంగా కొనసాగుతోంది,

# రాత్రికి తీరం దాటనున్న తీవ్ర వాయుగుండం - ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్

మొదటి పేజి తరువాయి



ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉరుములు, మెరుపుల దృష్ట్యా చెట్ల కింద ఉండవద్దని తెలిపింది. తీవ్ర వాయుగుండం ప్రభావంతో కాకినాడ, గంగవరం, విశాఖ, కళింగపట్నం పోర్టులకు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసింది. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూ.గో., ప.గో., ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, నంద్యాల, కర్నూలు, అనంతపురం ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అలాగే రేపు అల్లూరి, ఏలూరు జిల్లాలకు రెడ్ అలెర్ట్, ఉత్తరాంధ్ర అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, ఉమ్మడి తూ.గో., ప.గో., కృష్ణా, గుంటూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అదేవిధంగా ఎల్లుండి అల్లూరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. 6 గంటల్లో గంటకు 5 కి.మీ. వేగంతో : మరోవైపు పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం గడిచిన 6 గంటల్లో గంటకు 5 కి.మీ. వేగంతో కదులుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది ప్రస్తుతానికి గోపాల్‌పూర్‌కు 150 కి.మీ, కళింగపట్నానికి 50 కి.మీ, ఒడిశాలోని పూరీకి 250 కి.మీ, విశాఖపట్నానికి 120 కి.మీ దూరంలో కేంద్రీకృతమైందని వెల్లడించారు. ఇవాళ రాత్రికి తీవ్రవాయుగుండంగా విశాఖపట్నం-గోపాల్‌పూర్ మధ్య కళింగపట్నం సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని సూచించారు. దీని ప్రభావంతో నేడు, రేపు కోస్తాంధ్రలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. అలాగే ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 55-65 కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. అలాగే ఆకస్మిక వరదల పట్ల లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రెండ్రోజులుగా భారీ వర్షాలు : బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ప్రభావంతో శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస నియోజకవర్గంలో రెండ్రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆమదాలవలస, బూర్జ, పొందూరు మండలాల్లో ఎడతెరిపిలేని వానలతో వాగులు, వంకలు పోటెత్తుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాన నీరు చేరింది. ఆమదాలవలస తహసీల్దార్ సత్యం నదీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. తీవ్ర వాయుగుండం ప్రభావంతో అల్లూరి జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. పాడేరు, అరకు లోయ మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. జీకే వీధి మండలం సప్పర్ల పంచాయతీ చాట్రాయపల్లి, తోకగరువులోనూ వానలు పడుతున్నాయి. జర్రెల నుంచి అసంపల్లి వెళ్లే రహదారి కొట్టుకుపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముందస్తు జాగ్రత్తగా చాపరాయి జలపాతం మూసివేశారు. ఏజెన్సీలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో కలెక్టర్ నిశాంతి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో అంబేద్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షాలతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరులో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. వానలతో పత్తి, మిర్చి, వరి పైర్లకు ఉపయుక్తంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. విశాఖలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లాసెన్స్ బే కాలనీలో ఓ భారీ వృక్షం ఒక్కసారిగా నేలకూలింది. అదే సమయంలో అక్కడ పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనంపై చెట్టు పడింది. చెట్టు కూలడంతో విద్యుత్ తీగలు కూడా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం చెట్టును తొలగించేందుకు సహాయక చర్యలు చేపట్టారు.

# సర్‘పై నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా తీసుకున్నవే- ఎలాంటి అనుమానాలొద్దు: ఈసీ

మొదటి పేజి తరువాయి

అడిగే ప్రశ్నలు లేదా ఇచ్చే సూచనలు, ఓటర్ల హక్కులను కాపాడేందుకు చేసే పరిపాలనా ప్రక్రియలో భాగమేనని వివరించింది. ఎన్నికల వ్యవస్థను మెరుగుపరచటానికి కేవలం ముగ్గురు కమిషనర్లు మాత్రమే కాకుండా కమిషన్‌లో ప్రతి అధికారి సూచనలు ఇవ్వటానికి పూర్తి అధికారం కలిగి ఉన్నారని ఈసీ స్పష్టం చేసింది. ప్రక్రియ దేశవ్యాప్త అమలు ముగ్గురు కమిషనర్ల పర్యవేక్షణలో జరుగుతోంది. అయితే, ఈ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ఎన్నికల సంఘంలోని ముగ్గురు కమిషనర్లలో ఇద్దరైన సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి, పదేపదే ప్రశ్నలు లేవనెత్తారని ఓ వార్తా పత్రిక ఇటీవల వెల్లడించింది. తమకు తెలియకుండానే తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన ఆదేశాలపై సుఖ్ బీర్ సింగ్ , వివేక్ జోషి గత 10 నెలల్లో కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారని ఆ వార్తా పత్రిక నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. సర్ ప్రక్రియలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తాయి. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠను, విశ్వసనీయతను ఆయన పూర్తిగా దిగజార్చారని ఆరోపించాయి. తక్షణమే ఆయన్ను సీఈసీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశాయి. ఈసీని ఏదో అదృశ్యశక్తి నడిపిస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. మెజారిటీ సభ్యుల ఆమోదం లేకుండా తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకపక్షంగా భావించాల్సి ఉంటుందని పేర్కొంది. ఓటుచోరీ ద్వారా బీజేపీ, ఆర్ఎస్ ఎస్ , ఈసీ దేశద్రోహానికి పాల్పడ్డాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం ఆరోపించారు. ఓట్ల చోరీ అనేది రాజ్యాంగంపై ప్రత్యక్ష దాడి అని దయ్యబట్టారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఈసీ అధికారులను గతంలో హెచ్చరిస్తూ తాను చేసిన వ్యాఖ్యలను ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

### కోట్లాది మంది పేర్లను తొలగించి, బోగస్ ఓట్లను చేర్చారు!

మరోవైపు, పైస్థాయి నుంచి వచ్చిన ఆదేశాలతో కోట్లాది మంది పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించి, బోగస్ ఓట్లను చేర్చారని కేసీ వేణుగోపాల్ విమర్శించారు. సర్ ప్రక్రియను రద్దు చేసి సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేయాలని ఆప్ జాతీయ సమన్వయకర్త కేజ్రీవాల్ అన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలో ఈసీ ఏకచ్ఛత్రాధిపత్యంగా మారిందని సీపీఎం దుయ్యబట్టింది. వెంటనే పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి సీఈసీ అభిశంసన ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ జైలుకు వెళ్లటం ఖాయమని శివసేన- యూబీటీ ఎంపీ సంజయ్ రౌత్ జోస్యం చెప్పారు. ఆయనను వెనుక ఉండి నడిపిస్తున్న పెద్దలు దేశం విడిచి పారిపోవడం ఖాయమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు సీఈసీని అభిశంసించాల్సిన సమయం ఆసన్నమైందని టీఎంసీ రాజ్యసభాపక్ష నేత డెరెక్ ఒబ్రెయిన్ అన్నారు.



# ఎంపిక కమిటీ పిటిషన్‌పై భిన్నాభిప్రాయంతో సుప్రీం తీర్పు- వేర్వేరు ఉత్తర్వులు జారీ

మొదటి పేజి తరువాయి

మినహాయిస్తూ కేంద్రం తీసుకొచ్చిన 2023 నాటి చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసింది. ఈ పిటిషన్లను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేయాలా వద్దా అనే అంశంపై ద్విసభ్య ధర్మాసనంలోని న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ఈ పిటిషన్లలో రాజ్యాంగ ప్రాముఖ్యం కలిగిన ప్రశ్నలు ఉన్నాయని, వీటిని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీచేయాలన్న కేంద్ర ప్రభుత్వ వాదనను బెంచ్‌కు నేతృత్వం వహించిన జస్టిస్ దీపాంకర్ దత్తా తోసిపుచ్చారు. ఇదే ధర్మాసనంలో ఉన్న మరో న్యాయమూర్తి జస్టిస్ సతీష్ చంద్రశర్మ కేంద్రం వాదనతో ఏకీభవించారు. ఈ కేసుని సమర్థంగా, ప్రామాణికంగా విచారించేందుకు తగిన సభ్యులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఇద్దరు న్యాయమూర్తులు అంగీకరించారు. ఈ మేరకు తదుపరి నిర్ణయం కోసం పరిపాలనా పరంగా ఈ విషయాన్ని జజీ× జస్టిస్ సూర్యకాంత్ ముందు ఉంచాలని నిర్ణయించారు. రాజ్యాంగపరమైన సమస్యలను పరిష్కరించేందుకు శాశ్వతంగా ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని ద్విసభ్య ధర్మాసనం సీజేఐని కోరింది.

### 'కార్యనిర్వాహక వర్గానికి అధిక ప్రాధాన్యం'



"స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు జరగాలంటే ఈసీఐ ఒక స్వతంత్ర సంస్థగా ఉండటమే కాకుండా, స్వతంత్రంగా వ్యవహరిస్తున్నట్లు కనిపించాలి అనేది ఒక ప్రాథమిక సూత్రం. ఇలాంటి పరిస్థితుల్లో ఎంపిక కమిటీలో ఒక కేబినెట్ మంత్రిని చేర్చడం వల్ల ఒక తటస్థ ఎంపికదారు అందించగల స్వతంత్రత్వాన్ని అందించడంలో విఫలమవుతుంది. పైగా, ఆ కేబినెట్ మంత్రి కేవలం తన నాయకుడి గొంతునే ప్రతిధ్వనిస్తారు. ఫలితంగా ఎంపిక కమిటీలో ప్రతిపక్ష నాయకుడి (రాశీఫ) ఉనికి, ఆయనను చేర్చిన ఉద్దేశాన్ని ముందుకు తీసుకెళ్లకుండా చాలావరకు అలంకారప్రాయంగా మిగిలిపోతుంది. కార్యనిర్వాహక వర్గం నుంచి ఇద్దరు సభ్యులు కమిటీలో ఉండటం వల్ల వారి వర్గానికి ప్రభావవంతమైన వీటో అధికారం ఉంటుంది. ఆ వీటోనే డాక్టర్ అంబేద్కర్ వ్యతిరేకిస్తూ దీనిని ఆమోదించలేదు." అని జస్టిస్ దత్తా అన్నారు. 2023 చట్టం కార్యనిర్వాహక వర్గానికి అధిక ఎంపిక అధికారాన్ని కట్టబెడుతుందని అభిప్రాయపడ్డారు. తద్వారా స్వాతంత్ర్య స్వరూపాన్ని దెబ్బతీస్తుందని పిటిషనర్లు ప్రస్తావించిన అంశంలో ప్రాథమికంగా సారం ఉన్నట్లు కనిపిస్తోందని ఆయన అన్నారు. ఈ క్రమంలోనే పిటిషనర్లు సరైన కారణాలతోనే వాదించారని అన్నారు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 145(3) ప్రకారం ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనం అధికారికంగా నిర్ణయించాల్సి ఉంటుందని జస్టిస్ శర్మ వ్యాఖ్యానించారు. కాగా, సీఈసీ, ఈసీ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) స్థానంలో కేంద్ర మంత్రిని తీసుకునేందుకు ప్రతిపాదిస్తూ కేంద్రం చట్టం చేసింది. అయితే ఈ చట్టాన్ని దుర్వినియోగం చేసి కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించుకునే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టం కింద జరిగిన నియామకాలను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా, ప్రస్తుతం వాటిపై విచారణ కొనసాగుతోంది. అంతకుముందు మేలో జరిగిన విచారణ సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామక విధానాల నియంత్రణకు చట్టం చేయాలని పార్లమెంటును ఆదేశించే అధికారం తమకు ఉందా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఓ అంశంపై చట్టం చేయాలని పార్లమెంటును సుప్రీంకోర్టు ఎలా నిర్దేశించగలదు? ఇది ఆచరణ సాధ్యమేనా? అని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ధర్మాసనం ప్రశ్నించింది.

## భారత్- ఒపెక్ చమురు బంధం మరింత బలోపేతం
# దిల్లీలో ఉన్నత స్థాయి చర్చలు విజయవంతం!

### దిల్లీలో విజయవంతంగా ముగిసిన భారత్- ఒపెక్ 7వ ఉన్నత స్థాయి ఇంధన చర్చలు

### చమురు మార్కెట్లో స్థిరత్వం, ఇంధన భద్రతపై సమావేశం- పరస్పర సహకారానికి అంగీకారం!




ఢిల్లి : ప్రపంచంలోనే అతిపెద్ద చమురు వినియోగదారుల్లో మూడో స్థానంలో ఉన్న భారత్- పెట్రోలియం ఎగుమతి దేశాల సమాఖ్య ఒపెక్ (ఆర్గనైజేషన్ ఆఫ్ పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్) మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతమయ్యాయి. దిల్లీ వేదికగా మంగళవారం భారత్, ఒపెక్ కూటమి మధ్య 7వ హై లెవల్ ఎనర్జీ డైలాగ్ (ఉన్నత స్థాయి ఇంధన చర్చలు) విజయవంతంగా ముగిసింది. ప్రపంచ చమురు మార్కెట్లో ఒకవైపు అనిశ్చితి, ధరలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్న వేళ భారత్, ఒపెక్ మధ్య ఈ చర్చలు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశానికి భారత పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ, ఒపెక్ సెక్రటరీ జనరల్ హైథమ్ అల్ ఘైస్ సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ముఖ్యంగా చమురు మార్కెట్లో స్థిరత్వం, ఇంధన భద్రత, చమురు రంగంలో పెట్టుబడులు పెట్టడం వంటి అంశాల గురించి విస్తృతంగా చర్చించారు. పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని అంగీకరించారు. భారత్ తన చమురు అవసరాల్లో ఏకంగా 88 శాతానికిపైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. దీంతో అంతర్జాతీయ చమురు మార్కెట్లో ధరల హెచ్చుతగ్గులు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు వంటివి భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతాయి. ఈ క్రమంలోనే భారత్, ఒపెక్ మధ్య పరస్పర సహకారం, సత్సంబంధాలు ఉన్నాయని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ చెప్పారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఒపెక్ ప్రధాన కార్యదర్శి అందిస్తున్న సహకారానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని హర్దీప్ సింగ్ పురీ పేర్కొన్నారు. రానున్న దశాబ్దాల్లో అంతర్జాతీయంగా ఇంధన వినియోగంలో, డిమాండ్ పెంచడంలో భారత్ కీలక శక్తిగా అవతరిస్తుందని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఇంధన రక్షణకు చమురు ఉత్పత్తిదారులు, వినియోగదారుల మధ్య నిరంతర చర్చలు ఎంతో అవసరమని స్పష్టం చేశారు. ఇది ఇంధన రంగంలో పెట్టుబడుల్ని ప్రోత్సహించడంతో పాటుగా ఇంధన భద్రతను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. అప్పుడే ఇంధన సరఫరాలో అంతరాయాలు ఉండవని తెలిపారు.

### భారత్‌తో చర్చలు ఒపెక్‌కూ ముఖ్యమే!

మరోవైపు భారత్‌తో ఇంధన భాగస్వామ్యానికి ఒపెక్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఒపెక్ సెక్రటరీ జనరల్ హైథమ్ తెలిపారు. భారత ఇంధన ప్రాధాన్యతలు, ఒపెక్ లక్ష్యాలకు చాలా దగ్గరగా ఉన్నాయని ప్రశంసించారు. ప్రపంచ ఇంధన వ్యవస్థలో భారత్ కీలక పాత్ర పోషిస్తుందని, రానున్న దశాబ్దాల్లో భారత్ ప్రాముఖ్యత మరింత పెరుగుతుందని ఆయన అన్నారు. ఒపెక్ కూటమి, భారత్ మధ్య ఈ ఎనర్జీ డైలాగ్ 11 సంవత్సరాలుగా కొనసాగుతోందని హైథమ్ అల్ ఘైస్ గుర్తు చేశారు. ప్రపంచంలో పుట్టుకొస్తున్న సవాళ్లను పరిష్కరించడానికి భారత్ ఎప్పుడూ దౌత్య మార్గంలో పయనిస్తుందని, చర్చల కోసమే నిరంతరం ప్రోత్సహించడం సంతోషకరమని వ్యాఖ్యానించారు.

### 2015లో ప్రారంభమైన ఇంధన చర్చలు

భారత్- ఒపెక్ మధ్య ఎనర్జీ డైలాగ్‌ను (ఇంధన చర్చలు) తొలిసారి 2015లో దిల్లీలో ప్రారంభించారు. అప్పటి నుంచి ఉన్నత స్థాయిలో సమావేశాలు జరుగుతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతిదారుల సమాఖ్యకు, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు వినియోగ దేశమైన భారత్‌కు మధ్య సమన్వయం కోసం ఇదో చక్కటి వేదికగా పనిచేస్తోంది. ప్రస్తుతం అమెరికా- ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొనగా చమురు మార్కెట్ స్తంభించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సప్లై చెయిన్‌లో అంతరాయాలు, పెరుగుతున్న డిమాండ్ వంటి ఎన్నో అంశాలు ఇంధన సరఫరాపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలోనే భవిష్యత్తు చమురు సరఫరాను మెరుగుపర్చడం, భద్రత కోసం సకాలంలో పెట్టుబడులు కూడా అవసరమని భారత్, ఒపెక్ అభిప్రాయపడ్డాయి. ఇక ప్రస్తుత 7వ విడత చర్చలు విజయవంతం కావడంతో తదుపరి 8వ ఉన్నత స్థాయి సమావేశాన్ని ఆస్ట్రియాలోని వియన్నాలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇంకా సమావేశానికి సంబంధించి తేదీలు ఖరారు చేయలేదు. వియన్నాలోనే ఒపెక్ ప్రధాన కార్యాలయం ఉంది.

# సంపాదకీయం

## చమురు రంగంలో తెలుగు సంస్థలు

దేశ సరిహద్దులకు ఆవల ప్రపంచవ్యాప్తంగా భారత వాణిజ్య విజయం అంటే సహజంగా ఐటీ రంగ దిగ్గజ సంస్థలే గుర్తుకు వస్తాయి. ఈ సంస్థలు సకాలంలో మెరుగైన సేవలు అందించి లాభాలు ఆర్జిస్తున్నాయి; భారత యువజనులకు పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్నాయి; మరీ ముఖ్యంగా భారతీయుల ప్రతిభా పాటవాలకు అంతర్జాతీయంగా ఎనలేని గుర్తింపును సాధిస్తున్నాయి. ఈ కారణంగానే సమకాలీన భారతీయ వాణిజ్య విజయాలకు ఐటీ సంస్థలు ప్రతీకలుగా వెలుగొందుతున్నాయి. ఇటీవల కొంతకాలంగా ఐటీ సంస్థలకు అదనంగా భారతీయ ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల సంస్థలూ విదేశాలలో విజయవంతంగా విస్తరిస్తున్నాయి. ఇది శుభ పరిణామం. ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రపంచంలో అగ్రభాగాన నిలిచే చమురు నిక్షేపాల నెలవులు అయిన గల్ఫ్ అరబ్బు దేశాలలో ఈ సంస్థలు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి. వాస్తవానికి భారతీయ ఇంజినీరింగ్, నిర్మాణ రంగ సంస్థలకు అరబ్బు దేశాలు కొత్త కాదు. చమురు ఎగుమతి ఆరంభ కాలం (1970వ దశకం)లో టాటా గ్రూప్ భాగస్వామి అయిన అగ్రగామి కాంట్రాక్టింగ్ కంపెనీ 'షాపుర్జీ పల్లోంజీ' గల్ఫ్ దేశాలలో సివిల్ నిర్మాణాలను విరివిగా చేపట్టింది. ఈ ఎడారి దేశాలలో మట్టి సరిగ్గా అందుబాటులో ఉండదు. దీంతో అవసరమైన మట్టిని షాపుర్జీ పల్లోంజీ కంపెనీ భారతదేశం నుంచి నౌకలలో తీసుకువచ్చేది. అప్పుడే ఆ కంపెనీ యువ ఇంజినీరు ఎ.పి.జితేందర్ రెడ్డిని కూడా ఉద్యోగ వీసాపై గల్ఫ్‌కు తీసుకువచ్చింది. సుదీర్ఘకాలం అరబ్బు దేశాలలో ఉన్న జితేందర్ దేశానికి తిరిగి వెళ్లి పార్లమెంటుకు పోటీ చేసి ఎన్నికయ్యారు. ఎలక్ట్రోమెకానికల్ రంగంలో ప్రముఖ భారతీయ సంస్థ 'ఎల్ అండ్ టీ' పూర్తి చేసిన 65 బిలియన్ డాలర్ల విలువైన పనులలో దాదాపు సగం సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్ దేశాలకు చెందినవే కావడం విశేషం. ఎడారి ఉష్ణోగ్రతలో ఎయిర్ కండిషన్ ఇంజినీరింగ్ భారీ కాంట్రాక్టులను ప్రపంచ దిగ్గజ బహుళజాతి సంస్థలతో పోటీపడి ఎల్ అండ్ టీ విజయవంతంగా పూర్తిచేసింది. మారుమూల ఇసుక ఎడారుల గుండా హై వోల్టేజీ విద్యుత్ లైన్ల నిర్మాణంలో కూడా ఎల్ అండ్ టీ తన విశిష్టతను చాటింది. గల్ఫ్ దేశాలలో పైపులైను వ్యవస్థ అత్యంత కీలకమైనది. నీటి వనరులు లేని ఈ ఎడారి దేశాలలో వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్ర తీరం నుంచి శుద్ధి చేసిన ఉప్పు నీటిని నగరాలకు సరఫరా చేయడం, చమురును నౌకాశ్రయాల వరకు రవాణా చేయడానికి పైపులు ప్రధాన ఆధారాలు. ఈ పైపుల నిర్మాణం, సరఫరా పనుల్లో భారతీయ సంస్థలే ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. చమురు పైపుల నిర్మాణం, నిర్వహణలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన నిపుణులు పెట్టింది పేరు. గల్ఫ్ దేశాలు అంటే చమురు, గ్యాస్‌కు మారుపేరు. ఈ దేశాలలో ప్రతి వ్యవస్థ ఈ రంగంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అనుసంధానమై ఉంటుంది. నిరంతర విస్తరణ, నిర్వహణ పనులు ఉండే ఈ రంగంలో ఇప్పటి వరకు భారతీయ సంస్థలు ఏవీ కూడా పోటీపడలేదు. సాధారణంగా అమెరికా, జర్మనీ, బ్రిటన్ దేశాల ఇంజినీరింగ్ సంస్థలే ఇందులో సదా అగ్రగాములుగా ఉంటాయి. ప్రప్రథమంగా భారతీయ సంస్థలు అందునా తెలుగు రాష్ట్రాలకు చెందిన సంస్థలు చమురు రంగంలో సాహసోపేతంగా అడుగుపెడుతున్నాయి. చమురు ఉత్పాదకతలో విడుదలయ్యే వివిధ రసాయనాలను వేరు చేస్తూ నికర చమురును తీయడం ఒక ముఖ్య ప్రక్రియ. ఇందుకు అవసరమైన ప్లాంట్లను సాధారణంగా పాశ్చాత్య దేశాల సంస్థలు మాత్రమే నిర్మిస్తాయి. ఈ రకమైన నిర్మాణ పనుల కాంట్రాక్టును హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజినీరింగ్ సంస్థ కువైత్‌లో దక్కించుకుని ప్రపంచ ఇంజినీరింగ్ సంస్థలను ఆశ్చర్యానికి గురిచేసింది. 381 మిలియన్ డాలర్ల ఈ కాంట్రాక్టు చమురు రంగంలో భారతీయ సంస్థల ప్రాబల్యానికి ఒక తిరుగులేని నిదర్శనం. ఇంతకు ముందూ కువైత్ చమురు సంస్థ నొకదానిలో 225 మిలియన్ డాలర్ల కాంట్రాక్టును మేఘా సంస్థే దక్కించుకుంది. సౌదీలో 300 కిలోమీటర్ల పైపు లైను ద్వారా మక్కా పుణ్యక్షేత్రానికి ఐదు లక్షల క్యూసెక్కుల మంచి నీరు సరఫరా చేసే అర్హత పొందిన సంస్థల జాబితాలో కూడా మేఘా ఉన్నది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రోగ్రెసివ్, రాంకీ, జి.యం.ఆర్ సంస్థలు గతంలో వివిధ రంగాలలో కొన్ని పనులు చేసినా కీలకమైన చమురు రంగంలో మేఘా ప్రవేశమే భారతీయ కంపెనీలకు ఒక కొత్త ప్రారంభమని చెప్పవచ్చు. భారత వాణిజ్య విజయాలలో ఇదొక ఉజ్వల అధ్యాయం. ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ ఐటీ సంస్థల జైత్రయాత్రను ఇంజినీరింగ్ సంస్థలూ కొనసాగించాలి.

# వైరస్‌ల సృష్టికి ఏఐని వాడితే?



'ప్రపంచంలో అత్యంత ప్రమాదకర బయో ఉగ్రవాది ప్రకృతే'- బయో సెక్యూరిటీ రంగంలో ఉన్న నానుడి ఇది. జీవాయుధాలతో ఉగ్రవాదులు చేయగలిగే దాడికన్నా, సహజసిద్ధంగా వచ్చిపడే వ్యాధికారక సూక్ష్మజీవులతోనే అధికంగా మరణాలు సంభవిస్తాయని చెప్పడానికి ఈ మాటను వాడుతుంటారు. అయితే, దీనికి త్వరలోనే కాలం చెల్లనుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుశిక్షిత ఏఐ నమూనాలు కొత్త వైరస్‌లను డిజైన్ చేయగలవని తాజాగా వెల్లడి కావడమే ఇందుకు కారణం. ఏఐ సాధనాలు అనేక రంగాల్లో వేగంగా ముందడుగు వేస్తున్నాయి. కొత్త యాంటీబయాటిక్స్ రూపకల్పనలోనూ వీటిని వాడుతున్నారు. అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఇటీవల ఒకడుగు ముందుకేసి ఈ పరిజ్ఞానంతో 16 కొత్త వైరస్‌లను డిజైన్ చేశారు. ఏఐతో జీనోమ్ మొత్తాన్నీ రూపొందించడం ఇదే మొదటిసారి. ఇందుకోసం పరిశోధకులు ఎవో1, ఎవో2 అనే ఏఐ నమూనాలను ఉపయోగించారు. అవి చాట్‌జీపీటీ తరహాలో పదాలను కాకుండా జీవానికి సంబంధించిన భాషను అంచనావేస్తాయి. వైరస్‌లు, బ్యాక్టీరియా, మొక్కలు, మానవుల జన్యుకోడ్‌లపై ఈ సాధనాలు శిక్షణ పొందాయి. ఇవి రూపొందించిన వైరస్‌లు- బ్యాక్టీరియాకు మాత్రమే ఇన్‌ఫెక్షన్ కలిగిస్తాయి, మనిషికి హానిచేయవు. యాంటీబయాటిక్స్‌కు లొంగని మొండి బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లను నయం చేయడానికి వీటిని ఉపయోగించవచ్చు. కానీ, ఈ పరిజ్ఞానంతో కొత్త వ్యాధులకు దారితీసే వైరస్‌లను సృష్టించే ఆస్కారముందన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### దుర్వినియోగమైతే పెద్ద ప్రమాదం

ఏఐ సామర్థ్యాలు పెరిగేకొద్దీ వైరల్ జీవాయుధాల రూపకల్పన, ఉత్పత్తి సులువవుతుంది. గతంలో వాడిన ఈ తరహా ఆయుధాల కన్నా ఇవి ఎక్కువ ప్రమాదకారులు కావొచ్చు. ఆధునిక బయో దాడులన్నీ ఆంత్రాక్స్, రిసిన్ వంటి పదార్థాలతో ముడిపడినవే. వాటివల్ల ఏకకాలంలో పదుల సంఖ్యలో ప్రజలకు మాత్రమే హాని జరిగింది. పైగా బాధితులకు కలిగిన అనారోగ్యం ఇతరులకు సంక్రమించేది కాదు. కొత్త వైరస్‌ల డిజైన్ మాత్రం జీవాయుధ దాడులను తీవ్రతరం చేయవచ్చు. వాటివల్ల ఏర్పడే ఇన్‌ఫెక్షన్లు మనుషుల మధ్య వ్యాపించవచ్చు, మహమ్మారులకూ అవి దారితీయవచ్చు. కాబట్టి, ఇలాంటి పరిస్థితి రాకముందే ప్రభుత్వాలు మేల్కోవాలి. ఆధునిక పరిజ్ఞానాల దుర్వినియోగానికి వీలు కల్పించే సాధనాలు, డేటా, పదార్థాలపై గట్టి నియంత్రణ పెట్టాలి. ప్రమాదకర వైరస్‌ల తయారీని అడ్డుకోవడానికి జీన్ సింథసిస్ స్క్రీనింగ్‌ను తప్పనిసరి చేయాలి. ఇందులో భాగంగా డీఎన్ఏ లేదా ఆర్ఎన్ఏను ల్యాబ్‌లకు విక్రయించే కంపెనీలపై దృష్టి సారించాలి. తప్పనిసరి స్క్రీనింగ్‌లో భాగంగా ఈ కంపెనీలు సంబంధిత వినియోగదారు నిజమైన పరిశోధకుడేనా అన్నది ధ్రువీకరించుకోవాలి. ప్రమాదకరమైన జన్యుక్రమాల కొనుగోలు ప్రయత్నాలను అడ్డుకోవాలి. డీఎన్ఏ, ఆర్ఎన్ఏ తయారీ పరికరాల విక్రయాలపైనా కన్నేసి ఉంచాలి. ఈ విషయంలో డిజిటల్ నియంత్రణలనూ తీసుకురావాలి. ల్యాబ్‌లో నిర్ధారించిన డేటాసెట్‌లపై శిక్షణ పొందడం ద్వారా ఏఐ నమూనాలు వైరస్‌లను డిజైన్ చేయడం నేర్చుకుంటాయి. ఈ డేటాసెట్లలో భిన్న వైరస్‌లకు సంబంధించిన డీఎన్ఏ లేదా ఆర్ఎన్ఏ సీక్వెన్సులు ఉంటాయి. వీటిని మహమ్మారులపై నియంత్రణ, నిఘా కోసం ఉత్పత్తి చేస్తుంటారు. వైరస్‌లను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన వైద్యపరమైన చర్యల గురించీ, లేదా మహమ్మారి విజృంభించినప్పుడు ఎలా స్పందించాలన్నది తెలుసుకోవడానికీ ఇది ఉపయోగపడుతుంది. అయితే దీన్ని దుర్వినియోగం చేసే ప్రమాదం లేకపోలేదు. వైరస్ ఎంత వేగంగా వ్యాపించగలదు? ఎంత ప్రమాదకరంగా మారగలదు? అనే వివరాలు కూడా ఈ డేటాసెట్లలో ఉంటాయి. జీవాయుధాల రూపకల్పనకు ఈ వివరాలు ఉపయోగపడతాయి. అందువల్ల ఇలాంటి 'డిజిటల్ రెసిపీల' లభ్యతను పరిమితం చేయాలి. కొందరు జీవ పదార్థాలను సొంతంగానే రూపొందించుకోగలరు. వాణిజ్య సరఫరాదారుల నుంచి న్యూక్లిక్ ఆమ్లాలను సేకరించాల్సిన అవసరం వారికి ఉండదు. ఏఐ సాయం లేకుండానే ప్రమాదకర సూక్ష్మజీవులను రూపొందించగల నైపుణ్యం కొందరికి ఉంటుంది. భారీ రక్షణ ఏర్పాట్ల మధ్య ఉన్న ఏఐ నమూనాలను సైతం ప్రత్యేకంగా రూపొందించిన ప్రాంప్ట్‌లతో తమ నియంత్రణలోకి తెచ్చుకోగల తెలివైన విద్రోహులు ఉంటారు. ఇలాంటివారి కోసం అదనపు రక్షణ ఏర్పాట్లు అవసరం. ప్రమాదకర సూక్ష్మజీవులకు సంబంధించి ముందస్తు హెచ్చరిక వ్యవస్థనూ డిజైన్ చేయాలి. తద్వారా కొత్త వైరస్ విజృంభణను వేగంగా పసిగట్టే అవకాశం ఉంటుంది. కృత్రిమ వైరస్ మూలాలను ఫోరెన్సిక్ టెక్నాలజీ సాయంతో వేగంగా పట్టుకోవాలి. మార్పిడి చేసిన వైరస్‌లను అధికారులు వేగంగా గుర్తించి, వాటి మూలాలను పట్టుకుంటారని ముష్కరులు గ్రహిస్తే- ఇక వారు అటువంటి ప్రయత్నాల జోలికి వెళ్లరు.

### సమతౌల్యం ముఖ్యం

జీవ పరిశోధనలపై ఆంక్షలను ఆచితూచి విధించాలి. కొన్ని డేటాసెట్ల లభ్యతపై నియంత్రణలు పెట్టడమంటే, ప్రాణాలను కాపాడే సైన్స్ వేగాన్ని నెమ్మదింప చేయడమే. ప్రయోజనకరమైన పరిశోధనలను కొనసాగిస్తూనే, వాటి దుర్వినియోగాన్ని నివారించడం ముఖ్యం. ప్రస్తుతం అణు సంబంధ పరిజ్ఞానమేదైనా 'రహస్య' విభాగం కిందకి వస్తుంది. కానీ, జీవసంబంధ పరిశోధనలు మాత్రం ఎక్కువగా సమాజహితం కోసం ఉద్దేశించినవే. పైగా వాటి ప్రధాన లక్ష్యం యుద్ధం కాదు కాబట్టి... వాటిని కొనసాగిస్తూనే దుర్వినియోగాన్ని అరికట్టాలి. అందుకోసం సమర్థ రక్షణ వ్యూహాన్ని అభివృద్ధి చేయడానికి ప్రత్యేక వనరులు, సాంకేతిక పురోగతి, గట్టి రాజకీయ సంకల్పం, అంతర్జాతీయ సమన్వయం అవసరం. అదృష్టవశాత్తు ఈ విషయంలో స్పందించడానికి సమయం ఇంకా మించిపోలేదు. ఏఐ నమూనాలు ఇంకా మనిషికి ఇన్‌ఫెక్షన్ కలిగించే స్థాయిలో అభివృద్ధి చెందలేదు. బ్యాక్టీరియాకు ఇన్‌ఫెక్షన్ కలిగించే కొత్త వైరస్‌నైనా రూపొందించడానికి అధునాతన పరికరాలు, ల్యాబ్‌లు, వనరులు కావాలి కాబట్టి, ప్రస్తుతానికి వాటిని అంత సులభంగా రూపొందించలేరు. అయినా ఒక ఏఐ నమూనా అనేక సాంక్రమిక వైరస్ డిజైన్లను ఉత్పత్తి చేయగలిగిందంటే, ఆ సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడానికి లేదా దుర్వినియోగం చేయడానికి ఎక్కువ సమయం పట్టదని గుర్తించాలి.

# ఉత్పాదకత లేని యువత..

యువ జనాభా శక్తి భారత్‌కు లభించిన అతిపెద్ద ఆర్థిక ఆస్తి అని చెబుతారు. దీన్ని డెమోగ్రాఫిక్ డివిడెండ్‌గా ప్రచారం చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ మానవ వనరు ప్రమాదకరమైన నిశ్చల స్థితిలోకి జారుకుంటోంది. చదువు, ఉద్యోగం లేదా ఎలాంటి వృత్తి నైపుణ్య శిక్షణ లేకుండా నిరుపయోగంగా మిగిలిపోతున్న యువతను చీజుజు (చీశీ అఅ జుంబఝ్‌అశీఅ, జుఎజూశ్రీశీఎఎవత్ శీతీ ఎతీఋఱఅఱఅస్త్ర) వర్గంగా పరిగణిస్తారు. ఒక పక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నైపుణ్యాభివృద్ధి పేరుతో వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. మరో పక్క క్షేత్రస్థాయిలో ఈ నీట్ సంక్షోభం తీవ్రతరమవుతోందనేది తాజా ఆర్థిక, సామాజిక గణాంకాలు స్పష్టం చేస్తున్న చేదు నిజం.



### నిశ్చల స్థితిలో 9 కోట్ల మంది..

పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (ూాఖీూ), కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ వెల్లడించిన సమగ్ర వివరాల ప్రకారం దేశంలో 15 నుండి 29 ఏళ్ల మధ్య వయస్సున్న యువతలో దాదాపు 24.5 శాతం నుంచి 26 శాతం మంది ఈ నీట్ (చీజుజు) పరిధిలోనే ఉండిపోయారు. సంఖ్యాపరంగా చూస్తే ఇది దాదాపు తొమ్మిది కోట్లకు పైగా ఉత్పాదక శక్తి నిరుపయోగంగా మారడమే. ఇందులో లింగ వివక్ష అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉంది. యువకులలో ఈ నిష్పత్తి 10 నుంచి 12 శాతం వరకు ఉంటే, యువతులలో ఏకంగా 38 నుంచి 40 శాతానికి పైగా నమోదవుతోంది. అంటే ప్రతి పది మంది యువతుల్లో నలుగురు ఆర్థిక ఉత్పత్తి ప్రక్రియకు పూర్తిగా దూరంగా ఉండిపోతున్నారు. మరోవైపు దేశంలోని దాదాపు నాలుగో వంతు (23.7 శాతం) జిల్లాల్లో నీట్ రేటు 30 శాతానికి పైగా ఉండటం తీవ్ర ప్రాంతీయ అసమానతలకు అద్దం పడు తోంది. పైగా సాధారణ చదువుల కంటే డిగ్రీలు, పీజీలు పూర్తి చేసిన గ్రాడ్యుయేట్లలోనే నైపుణ్య లోపం వల్ల నిరుద్యోగ తీవ్రత ఎక్కువగా ఉండటం మన ఉన్నత విద్యా వ్యవస్థ డొల్లతనాన్ని బయటపెడుతోంది.

### బడ్జెట్ వ్యయం.. పదేళ్ల లెక్కల తీరు..

నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ద్వారా గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.25,000 కోట్లను వెచ్చించింది. దీనికి గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన పట్టణ వ్యవహారాల చీఖువీ వంటి ఇతర పథకాల వ్యయాన్ని కలిపితే మొత్తం ప్రభుత్వ వ్యయం దాదాపు ₹40,000 కోట్ల మేర ఉంటుందని అంచనా. ఇందులో సుమారు రూ.14,000 కోట్లకు పైగా నిధులు ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (ూవీఖవ్ 1.0 నుంచి 4.0) కింద స్వల్పకాలిక శిక్షణలు, సర్టిఫికెట్ల జారీ కోసమే ఖర్చయ్యాయి. అప్రెంటిస్‌షిప్ స్టైపెండ్ల కోసం (చీూూూ) దాదాపు రూ.2,500 కోట్లు, ఐటీఐల ఆధునీకరణ కోసం మరో రూ.3,000 కోట్లకు పైగా బడ్జెట్‌ను కేటాయించారు..

### నిధుల వ్యయంలో వ్యవస్థాగత వైఫల్యాలు..

భారీగా ప్రజాధనం వెచ్చిస్తున్నా నీట్ నిష్పత్తి తగ్గకపోవడానికి నిధుల నిర్వహణలోని విధానపరమైన వైఫల్యాలే కారణం. ప్రభుత్వ ప్రాధాన్యత మొదటి నుంచీ నాణ్యత కంటే సంఖ్యల వేట చుట్టూనే తిరుగుతుంది. ప్రైవేట్ శిక్షణా సంస్థలకు అభ్యర్థుల నమోదు, పరీక్షలు, సర్టిఫికెట్ల జారీ ఆధారంగానే నిధులు చెల్లిస్తున్నారే తప్ప, వారికి పరిశ్రమలలో స్థిరమైన ఉపాధి లభించిందా? ఉద్యోగంలో కనీసం ఏడాది పాటు కొనసాగారా? అనే అంశాలను పట్టించుకోవడం లేదు. మార్కెట్‌లో ఆటోమేషన్, అధునాతన తయారీ, గ్రీన్ ఎనర్జీ, సేవా రంగాలకు అనుగుణమైన డిమాండ్ ఉంటే, నిధులను మాత్రం పాతకాలపు డేటా ఎంట్రీ, ప్రాథమిక రిటైల్, కుట్టు పని వంటి కోర్సుల కోసం ఖర్చు పెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

### కోట్లలో సర్టిఫికెట్లు.. నో అంటున్న కార్పొరేట్లు..

ఫలితంగా కోట్లలో సర్టిఫికెట్లు తయారైనా, పరిశ్రమలు కోరుకునే నైపుణ్యాలు అభ్యర్థుల్లో లేక కార్పొరేట్ వర్గాలు వారిని తిరస్కరిస్తున్నాయి. మరో ప్రధాన లోపం స్థానిక ఆర్థిక వ్యవస్థలతో అనుసంధానం లేకపోవడం. దేశమంతటికీ ఒకే కేంద్రీకృత నమూనాను రుద్దడం వల్ల స్థానిక చిన్న, మధ్య తరహా పరిశ్రమల క్లస్టర్లకు కావాల్సిన మానవ వనరుల అవసరాలను శిక్షణ కార్యక్రమాలు తీర్చలేక పోయాయి.. దీంతో శిక్షణ పూర్తయిన గ్రామీణ యువత మెట్రో నగరాలకు వలస వెళ్లలేక, సొంత ఊళ్లలో అవకాశాలు దక్కక తిరిగి నీట్ వర్గంలోకే జారిపోతున్నారు. ఇక మహిళల విషయానికొస్తే కేవలం శిక్షణ ఇవ్వడమే సరిపోదనే కనీస అవగాహన లోపించింది. గ్రామీణ యువతులకు శిక్షణ తర్వాత సురక్షితమైన ప్రజా రవాణా, కార్యాలయ భద్రత, చైల్డ్‌కేర్, గృహ బాధ్యతలను సమతుల్యం చేసుకునే సామాజిక మద్దతు కల్పించకపోవడం వల్ల వారి సర్టిఫికెట్లు గడప దాటని కాగితాలుగా మిగిలిపోతుండడం విచారకరం.

### ఢిల్లీ నుంచి విధానాలు రుద్దకండి!

వేల కోట్ల రూపాయల ప్రజాధనం ఉత్పాదక ఫలితాలు ఇవ్వాలంటే ప్రభుత్వ వ్యయ విధానంలో సమూల ప్రక్షాళన జరగాలి. శిక్షణా సంస్థలకు ఇచ్చే నిధులను సర్టిఫికెట్ల సంఖ్యతో కాకుండా ఉద్యోగ నియామకం, పని ప్రదేశంలో వారి కొనసాగింపుతో ముడిపెట్టే 'పనితీరు ఆధారిత నిధుల విడుదల' విధానాన్ని తప్పనిసరి చేసి, కచ్చితంగా అమలు చేయాలి. పరిశ్రమల ప్రాంగణాల్లోనే జరిగే దీర్ఘకాలిక అప్రెంటిస్‌షిప్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఢిల్లీ నుంచి విధానాలు రుద్దడం మాని, స్థానిక సూక్ష్మ పరిశ్రమల డిమాండ్‌కు అనుగుణంగా నిధులు ఖర్చు చేసే అధికారాలను జిల్లా నైపుణ్య కమిటీలకు అప్పగించాలి. మహిళా శ్రామిక శక్తికి అవసరమైన రవాణా, భద్రతా వసతులను నైపుణ్య బడ్జెట్‌తో అనుసంధానించినప్పుడే నిశ్చల స్థితిలో ఉన్న తొమ్మిది కోట్ల మంది యువత దేశ ఆర్థిక పురోగతికి నిజమైన చోదక శక్తిగా మారగలరు.

# హక్కులు అడగాలి.. బాధ్యతలు నిర్వర్తించాలి!

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతన సవరణ, కరువు భత్యం కోరడం ఉద్యోగుల న్యాయమైన హక్కు. వారి శ్రమకు తగిన గౌరవం, ప్రతిఫలం దక్కాలి. అదే సమయంలో ప్రజల పన్నులతో నడిచే ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల నమ్మకం కూడా నిలబడాలి. ఉద్యోగుల హక్కులతో పాటు వారి కర్తవ్యాన్ని గుర్తుచేసుకోవాల్సిన సమయం ఇది. జీతం పెరగాలి... అదే సమయంలో ప్రజలకు సేవ కూడా మెరుగుపడాలి. అప్పుడే మంచి పాలన సాధ్యమవుతుంది. ఈ రోజు తెలంగాణలో అన్ని శాఖల ఉద్యోగులు వేతన సవరణ, కరువు భత్యం కోసం గొంతెత్తుతున్నారు. అన్ని రంగాల ఉద్యోగుల బాధ ఒకటే. నిత్యావసర ధరలన్నీ రెట్టింపు అయ్యాయి... అలాంటప్పుడు జీతం పెరగాలని అడగడం తప్పా? ఉద్యోగికి జీతం అందకపోతే కుటుంబం ఎలా గడుస్తుంది? అందుకే వారి పోరాటాన్ని మనందరం సమర్థించాలి.. వారి కష్టానికి విలువ ఇవ్వాలి. కానీ ఇక్కడే చాలా లోతైన ప్రశ్న ఉంది. దీన్ని ఆలోచించాలి.

### ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం రావాలంటే..?

మా పక్క వీధిలో ఒక ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారు. అప్పుడప్పుడు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు చదువు, భవిష్యత్తు గురించి ప్రేరణ ఇస్తుంటారు. ఒకసారి ఆయన పిల్లలు ఎక్కడ చదువుతున్నారని అడిగితే, ప్రైవేట్ స్కూల్లో అన్నారు. ఇది ఎవరినీ తప్పుపట్టడానికి కాదు, ఒక ఆత్మవిమర్శకు దారితీసిన విషయం. ప్రభుత్వ ఉద్యోగి తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తే, ఆ పాఠశాలపై తల్లిదండ్రులకు, సమాజానికి నమ్మకం పెరుగుతుంది. మనం సృష్టించిన ప్రభుత్వ బడిని మనమే నమ్మకపోతే, పేదవాడు ఎలా నమ్ముతాడు? ఇదే విషయం ప్రభుత్వ వైద్య వ్యవస్థకూ వర్తిస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది ఎంతో కష్టపడుతున్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవ చేశారు. వారు తమ కుటుంబ సభ్యులకు కూడా ప్రభుత్వ ఆసుపత్రినే నమ్మితే, పేదవాడికి మరింత భరోసా కలుగుతుంది. ప్రభుత్వ సేవపై నమ్మకం తగ్గి అందరూ ప్రైవేటు వైపు వెళ్తే, చివరికి నష్టపోయేది పేదవాడే.



### దీన్ని మెరుగుపరిస్తేనే..

రెవెన్యూ, పంచాయతీ, పురపాలక, విద్యుత్, రవాణా, పోలీసు, వ్యవసాయం, నీటిపారుదల ఇలా ప్రతి ప్రభుత్వ శాఖలోనూ ప్రజలకు సేవలు సులభంగా, సమయానికి అందాలి. పట్టా, ఇంటి అనుమతి, నీటి కనెక్షన్, విద్యుత్ మీటర్, సబ్సిడీ, విత్తనాలు, ఫిర్యాదు వంటి చిన్న పనుల కోసం ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే ప్రభుత్వంపై నమ్మకం తగ్గుతుంది. సిబ్బంది కొరత, పని ఒత్తిడి, సాంకేతిక సమస్యలు వంటి ఇబ్బందులు నిజమే. కానీ వాటి పేరుతో ప్రజలను పదేపదే తిప్పుకోవడం వల్ల దళారులపై ఆధారపడటం, అవినీతి పెరగడం, ప్రభుత్వ వ్యవస్థ బలహీనపడటం జరుగుతుంది. ప్రభుత్వ సేవ అంటే కేవలం ఉద్యోగం కాదు.. ప్రజల నమ్మకాన్ని మోసే బాధ్యత. మనం సృష్టించిన ప్రభుత్వ వ్యవస్థను మనమే నమ్మి, దాన్ని మెరుగుపరిస్తేనే ప్రజల్లో కూడా ఆ వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది.

### వేతన సవరణ కాదు, కర్తవ్యం కావాలి!

మన విధులు, బాధ్యతలు, కర్తవ్యం ఏంటి? ఉదయం సమయానికి కార్యాలయానికి రావడం, వచ్చిన ప్రతి మనిషి మాట ఓపికగా వినడం, కాగితాన్ని రేపు అనకుండా ఈ రోజే పూర్తి చేయడం, లంచం లేకుండా, విసుగు లేకుండా, చిరునవ్వుతో పని చేయడం ఇవి చిన్న విషయాలు కాదు, ఇవే ప్రజాస్వామ్యానికి పునాది, రాజ్యాంగం మనకు ఇచ్చిన కర్తవ్యం, మన జీతానికి మనం ఇచ్చే న్యాయం. జీతం ప్రజల పన్నుల నుండి వస్తుందని, మనం ప్రజల సేవకులమని గుర్తు చేసుకుంటే చాలు.. అప్పుడు వ్యవస్థ బాగుపడుతుంది, నమ్మకం తిరిగి వస్తుంది. అందరు అలానే అని కాదు.. కొందరు కింది స్థాయి ఉద్యోగులు కష్టం మామూ లుగా ఉండదు. వాళ్ళు నిజమైన ధీరులు, వారికి జీతం పెరగాలి, గౌరవం దక్కాలి, భద్రత ఉండాలి, వారి కుటుంబాలకు భరోసా ఉండాలి. పాఠశాలలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగి తన బడిని తన ఇల్లులా, ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగి తన ఆసుపత్రిని తన కుటుంబంలా, రెవెన్యూలో పనిచేసే ఉద్యోగి వచ్చిన రైతును తన అన్నలా, పోలీసు ఉద్యోగంలో పనిచేసే ఉద్యోగి ఫిర్యాదుదారుని తన తమ్ముడిలా చూస్తే చాలు..

### జీతం కంటే జనాల మెప్పే పెద్దది!

వేతన సవరణ, కరువు భత్యం అడగడం వాళ్ళ హక్కు. సరిగా పని చేయించుకోవడం మన హక్కు. రెండూ కలిస్తేనే మంచి పాలన. జీతం కంటే జనాల మెప్పే పెద్దది, అదే నిజమైన గెలుపు, అదే శాశ్వత గౌరవం. అందరూ కలిసి నడిస్తేనే మన ఊరు, మన రాష్ట్రం, మన పిల్లల భవిష్యత్తు బాగుపడుతుంది. బంగారు తెలంగాణ అవుతుంది. నిజమైన మార్పు కాగితాల్లో కాదు, మన ఆలోచనలో, మన కర్తవ్యంలోనే మొదలవుతుంది.

# గణేష్ నిమజ్జనం సందర్భంగా మద్యం దుకాణాల మూసివేత

**ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**




సంగారెడ్డి,**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని సంగారెడ్డి రెవెన్యూ జిల్లా పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు తదితరాలను తాత్కాలికంగా మూసివేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ప్రతీక్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.తెలంగాణ ఎక్సైజ్ చట్టం, 1968లోని సెక్షన్ 20 మరియు సంబంధిత నిబంధనల ప్రకారం ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (సీయూఆర్ఈ) పరిధిలోని ప్రాంతాలను మినహాయించి, సంగారెడ్డి రెవెన్యూ జిల్లా పరిధిలోని అన్ని ఏ4 మద్యం దుకాణాలు, 2-బీ బార్లు, కల్లు దుకాణాలు, కల్లు డిపోలు, సీఎస్-2 క్యాంటీన్లు మూసివేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ఈ మూసివేత 2026 సెప్టెంబర్ 25వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 26వ తేదీ ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.గణేష్ నిమజ్జనం సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనడంతో పాటు భారీ ఊరేగింపులు జరిగే అవకాశం ఉన్నందున, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడం, ప్రజల భద్రతను కాపాడడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఉత్తర్వులను ఎక్సైజ్, పోలీసు శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాల నిర్వాహకులు ఈ ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.

# వీ హబ్‌ను సందర్శించిన గీతం విద్యార్థినులు

**గీతం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు**

**వ్యవస్థాపకత, నూతన వ్యాపారాలపై అవగాహన**



హైదరాబాద్ **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** :హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థినులు బుధవారం మహిళా వ్యవస్థాపకత కేంద్రాన్ని (వీ హబ్) సందర్శించారు. గీతం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పారిశ్రామిక సందర్శన ద్వారా విద్యార్థినులకు వ్యవస్థాపకత, నూతన వ్యాపారాల పర్యావరణ వ్యవస్థపై విలువైన అవగాహన కల్పించారు. మహిళా సాధికారత విభాగం అధ్యక్షురాలు ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్ పర్యవేక్షణలో సుమారు 40 మంది విద్యార్థినులు, ఐదుగురు మహిళా అధ్యాపకులు ఈ సందర్శనలో పాల్గొన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం భారతదేశంలో ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రస్థాయి సమన్వయ సంస్థ అయిన వీ హబ్ ద్వారా విద్యార్థినులకు ఆవిష్కరణ, వ్యాపార సృష్టి, మార్గదర్శకత్వం, పరస్పర సంబంధాల ఏర్పాటు, పారిశ్రామిక మద్దతు వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్శన ద్వారా విద్యార్థినులు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను వాస్తవ ప్రపంచ పారిశ్రామిక పద్ధతులతో అనుసంధానించుకోవడంతో పాటు, మహిళల నేతృత్వంలోని వ్యవస్థాపకత, నాయకత్వం, సృజనాత్మకత, సమస్యల పరిష్కారంపై అవగాహన పొందారు. ఇది వారి వృత్తిపరమైన, వ్యక్తిగత అభివృద్ధికి దోహదపడే అర్థవంతమైన అనుభవపూర్వక అభ్యాస అవకాశంగా నిలిచింది.ఈ సందర్శనలో కంప్యూటర్ సైన్స్ మరియు సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ విభాగం నుంచి జ్యోతి బంకాపల్లి, డాక్టర్ అపర్ణ, వాస్తుశిల్ప విభాగం నుంచి డాక్టర్ సౌపూర్ణి పాల్, మనస్తత్వశాస్త్ర విభాగం నుంచి డాక్టర్ దుర్గేష్ నందిని తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.విద్యార్థినుల కోసం ఇటువంటి విజ్ఞానదాయకమైన, పరిశ్రమల ఆధారిత కార్యక్రమాలను ఏర్పాటు చేసినందుకు విశ్వవిద్యాలయ నాయకత్వానికి, మహిళా సాధికారత విభాగానికి విద్యార్థి బృందం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది.

# ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపిన ట్రాఫిక్ పోలీసులు

**యూటర్న్ మూసివేసి సిమెంట్ దిమ్మెల ఏర్పాటు**

**ప్రజల ఇబ్బందులను పరిష్కరించిన ట్రాఫిక్ సీఐకి దొడ్ల వెంకటేష్ గౌడ్ కృతజ్ఞతలు**



, హైదరాబాద్ **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ చౌరస్తా నుంచి హౌసింగ్ బోర్డు వైపు వెళ్లే ఉషాముల్లపూడి ప్రధాన రహదారిలో, ఆల్విన్ కాలనీ ఫేజ్-2 నుంచి శంషిగూడ వైపు వెళ్లే హైటెన్షన్ రోడ్డు నాలుగు రోడ్ల కూడలి వద్ద నిత్యం భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు ఉద్యోగాలు, విధులకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండటంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యను స్థానిక ప్రజలు ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఈ విషయాన్ని శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీతో పాటు బాలానగర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు.దీంతో స్పందించిన బాలానగర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి నాలుగు రోడ్ల కూడలి వద్ద అవసరమైన చర్యలు చేపట్టారు. సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేసి యూటర్న్‌ను మూసివేయడంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు మార్గం ఏర్పడింది. దీంతో గతంలో తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ రద్దీ కొంతమేర తగ్గి వాహనదారులకు ఉపశమనం లభించింది.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిన బాలానగర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావుకు దొడ్ల వెంకటేష్ గౌడ్ మీడియా ముఖంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, పోశెట్టి గౌడ్, లింగం, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 27 న వికారాబాద్ లో జరగబోయే మహాసభ ను విజయవంతం చేద్దాం: టీయూడబ్ల్యూజే హెచ్ 143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్


**వికారాబాద్ టౌన్ సెప్టెంబర్ 23...**



**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి జర్నలిస్ట్ ఐక్యంగా ముందుకు రావాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్( టీయూడబ్ల్యూజే హెచ్ 143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీ సాగర్ పిలుపునిచ్చారు.ఈ నెల 27 న అల్లం నారాయణ ఆధ్వర్యంలో వికారాబాద్ లో జరగబోయే మహాసభకు ప్రతి ఒక్క జర్నలిస్ట్ హాజరవ్వాలని... జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సందర్బంగా గోడ పత్రికను ఆవిష్కరించారు.జర్నలిస్టుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసి, ఎదురయ్యే సమస్యలను సంఘం దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం టీయూడబ్ల్యూజే హెచ్ 143 నిరంతరం కృషి చేస్తుందని మారుతీ సాగర్ తెలిపారు.

# రాజశేఖర్ నగర్‌లో గణనాథుడికి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రత్యేక పూజలు

**ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను ఘనంగా సన్మానించిన ప్రజలు**



వైరా **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు రాజశేఖర్ నగర్‌లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించారు.ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్ల రంగారావు, రాంపూడి రోశయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, చెరుకూరి కిరణ్, కౌన్సిలర్ మేర్ శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు వీరంశెట్టి సీతారాములు, అశోక్‌తో పాటు రాజశేఖర్ నగర్ ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ వినాయక నవరాత్రులను ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు గణనాథుడిని భక్తితో పూజించి, తమ కోరికలు నెరవేరాలని కోరుకుంటారని పేర్కొన్నారు. విఘ్నాలను తొలగించే గణనాథుడు ప్రజలందరినీ చల్లగా చూడాలని, ప్రతి ఒక్కరికీ మంచి ఆరోగ్యం, సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పైడిపల్లి శ్రీను, సూర్యదేవర శ్రీధర్, విలాసాగరం నరేష్, హరి శ్రీనివాసరావు, చెరుకూరి వెంకటేశ్వరరావు, బొల్లెపల్లి శ్రీనివాసరావు, చెరుకూరి కిరణ్, పువ్వాళ్ల రాజా, అమర్, నేనికృష్ణ, వీరపనేని చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులైన పేదలకు న్యాయం చేయాలి

**బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్**



మెదక్ **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల అంశంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.అయితే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని ఇందిరమ్మ ఇళ్ల పథకంగా పేరు మార్చి, అర్హులైన పేదలందరికీ కాకుండా పార్టీ నాయకులు సూచించిన వారికి ఇళ్లు కేటాయిస్తున్నదని ఆయన ఆరోపించారు. అర్హులైన పేదలకు ఇళ్లను అందకుండా చేస్తున్న తీరును బీజేపీ మెదక్ జిల్లా శాఖ తరఫున ఖండిస్తున్నామని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద తెలంగాణకు ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను కూడా విడుదల చేసి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి బీజేపీ మెదక్ జిల్లా శాఖ తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు.సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితానికి సంబంధించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా నాయకులు ఆవిష్కరించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, అనంతరం భారత ప్రధానమంత్రిగా ఆయన నిర్వహించిన బాధ్యతలు, ప్రజా సేవకు సంబంధించిన అంశాలను పుస్తకంలో పొందుపరిచినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కలికి నాగరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, మండల అధ్యక్షులు, సర్పంచ్ వీణ, మెదక్ కౌన్సిలర్ పబ్బ రాజమణి లక్ష్మణ్, ఇప్ప అఖిల భరత్, మోర్చా అధ్యక్షులు పట్లోళ్ల మల్లిక, అశోక్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గ్యాన్సింగ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు లోకబోయిన లోకేష్, జిల్లా కార్మిక సెల్ కన్వీనర్ శామయ్య మనోజ్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు శేఖర్ యాదవ్, అంకం శ్రీనివాస్, మహిళా మోర్చా నాయకురాలు శైలజ, మైనార్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కలీల్, సబ్బీన్ సింగ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాగాలాండ్ శిఖరంపై త్రివర్ణ పతాకం

**మౌంట్ సరమతి అధిరోహణతో 'సెవెన్ సిస్టర్స్ ఎక్స్‌పెడిషన్' పూర్తి**

**'హర్ శిఖర్ పర్ తిరంగా' లక్ష్యంతో ముందుకు సాగుతున్న భూక్య యశ్వంత్**



మరిపెడ **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా భూక్య తండాకు చెందిన భారత పర్వతారోహకుడు భూక్య యశ్వంత్ మరో ఘనత సాధించారు. నాగాలాండ్‌లోని అత్యంత ఎత్తైన శిఖరం మౌంట్ సరమతి 3,841 మీటర్లు ను సెప్టెంబర్ 20న ఉదయం విజయవంతంగా అధిరోహించి, అక్కడ జాతీయ జెండాను ఎగురవేశారు. దీంతో ఆయన చేపట్టిన 'హర్ శిఖర్ పర్ తిరంగా--సెవెన్ సిస్టర్స్ ఎక్స్‌పెడిషన్' విజయవంతంగా పూర్తయింది.షిల్లాంగ్ నుంచి ప్రారంభమైన యాత్ర నాగాలాండ్‌లోని కిఫిరే జిల్లా మీదుగా థనమిర్ ప్రాంతానికి చేరుకుంది. అక్కడి నుంచి సరమతి పర్వతం అడుగుభాగంలోని శిబిరానికి చేరుకుని సుమారు మూడు రోజుల పాటు క్లిష్టమైన పర్వతారోహణ కొనసాగించారు. పొడవైన నడక మార్గాలు, నిటారుగా ఉన్న జారుడు బాటలు, అటవీ ప్రాంతాలు, కఠినమైన శిఖర మార్గాలను అధిగమిస్తూ యశ్వంత్ బృందం ముందుకు సాగింది.చివరి దశలో ప్రతికూల వాతావరణంతో పాటు జారుడు మార్గాలు ఎదురైనా పట్టుదల, శారీరక సామర్థ్యం, బృంద సమన్వయంతో యశ్వంత్ శిఖరాన్ని చేరుకున్నారు. శిఖరాగ్రానికి చేరుకున్న అనంతరం త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి నాగాలాండ్ అధ్యాయాన్ని విజయవంతంగా ముగించారు.భూక్య తండా నుంచి ప్రారంభమైన తన పర్వతారోహణ ప్రయాణం పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసంతో సాగుతోందని యశ్వంత్ తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల యువత క్రీడలు, సాహస యాత్రల ద్వారా తమ ప్రతిభను చాటుకోవాలని ఆయన ఆకాంక్షించారు."నా ప్రయాణం కేవలం శిఖరాలను అధిరోహించడం మాత్రమే కాదు. పట్టుదల, ధైర్యం, కష్టపడి పనిచేసే తత్వం ఉంటే మన పరిమితులను అధిగమించవచ్చని యువతకు చూపించడమే నా లక్ష్యం. ప్రతి పర్వతం నాకు కొత్త పాఠాన్ని నేర్పింది. కృషి చేస్తే ఏ లక్ష్యమైనా సాధించవచ్చనే నమ్మకాన్ని ప్రతి యాత్ర మరింత బలపరిచింది" అని యశ్వంత్ పేర్కొన్నారు.హర్ శిఖర్ పర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా దేశంలోని 28 రాష్ట్రాల అత్యున్నత శిఖరాలను అధిరోహించి, ప్రతి శిఖరంపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడంతో పాటు ఆయా ప్రాంతాల పర్వతాలు, ప్రకృతి, సంస్కృతి, ప్రజల జీవన విధానాలను నమోదు చేయడం యశ్వంత్ లక్ష్యంగా పెట్టుకున్నారు.ఇప్పటికే అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, అసోం, మేఘాలయ, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గోవా తదితర రాష్ట్రాల అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. గురు శిఖర్, అర్మకొండ, దేవమాలి, సొన్సోగోర్ వంటి రాష్ట్ర శిఖరాలతో పాటు మౌంట్ గోరిచెన్, మౌంట్ రియో పుర్గ్యిల్, కాంగ్ యాట్సే--2, రష్యాలోని మౌంట్ ఎల్బ్రస్, టాంజానియాలోని మౌంట్ కిలిమంజారో వంటి ప్రముఖ శిఖరాలను కూడా అధిరోహించారు.నాగాలాండ్‌లోని మౌంట్ సరమతి విజయంతో లి'సెవెన్ సిస్టర్స్ ఎక్స్‌పెడిషన్'లిను పూర్తి చేసిన యశ్వంత్, తన తదుపరి పర్వతారోహణ లక్ష్యాల వైపు ముందుకు సాగుతున్నారు. ఈ ప్రయాణం సాహసం, క్రీడా స్ఫూర్తితో పాటు దేశభక్తి, యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా కొనసాగుతుందని ఆయన తెలిపారు.తన పర్వతారోహణ ప్రయాణానికి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం, సహకారం అందిస్తున్న అస్సాం రైఫిల్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ వికాస్ లఖేరా, ఏవీఎస్ఎం, ఎస్ఎంకు యశ్వంత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 13 ఏళ్ల నిరీక్షణకు తెర.. భూములు కోల్పోయిన పేదలకు ఇళ్ల పట్టాలు


**జగ్గారెడ్డి కృషితో తొగర్‌పల్లిలో 93 మంది లబ్ధిదారులకు పట్టాల పంపిణీ**



సంగారెడ్డి జిల్లా**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** ఏళ్ల తరబడి సొంతింటి స్థలం కోసం ఎదురుచూస్తున్న పేదల నిరీక్షణకు తెరపడింది. తొగర్‌పల్లి, అలియాబాద్ గ్రామాలకు చెందిన భూములు కోల్పోయిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో మొత్తం 93 మంది లబ్ధిదారులకు 125 గజాల చొప్పున ఇంటి స్థలాలను కేటాయిస్తూ పట్టాలు అందజేశారు.తొగర్‌పల్లి గ్రామానికి చెందిన 72 మంది, అలియాబాద్ గ్రామానికి చెందిన 21 మంది లబ్ధిదారులకు నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు.తొగర్‌పల్లి, అలియాబాద్ ప్రాంతాల్లో భూములు కోల్పోయిన కుటుంబాలకు గతంలో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ చేపట్టారు. అయితే తదనంతర పరిణామాలతో లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలపై హక్కు, స్వాధీనం కల్పించే ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో వారు సంవత్సరాల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.తమకు కేటాయించిన స్థలాలను చూపించి, సొంతింటి కలను సాకారం చేయాలని లబ్ధిదారులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారు. ఈ సమస్యను మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పలుమార్లు అసెంబ్లీలో ప్రస్తావించినట్లు ఆయన వర్గాలు తెలిపాయి.ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి గత సంవత్సరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు. అనంతరం మంత్రి అప్పటి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో మాట్లాడి, లబ్ధిదారులకు స్థలాల స్వాధీనం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఇళ్ల స్థలాల కేటాయింపులపై విధించిన నిషేధం కారణంగా ఈ ప్రక్రియ నిలిచిపోయిందని నిర్వాహకులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాల కేటాయింపులపై నిషేధం కొనసాగిందని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ ఈ అంశంలో పరిమితులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.జగ్గారెడ్డి విజ్ఞప్తి మేరకు తొగర్‌పల్లి లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు 13 ఏళ్ల తర్వాత జీవో విడుదలైందని కార్యక్రమంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇళ్ల స్థలాల కేటాయింపుల కోసం తెలంగాణ ఏర్పడిన తర్వాత వెలువడిన తొలి జీవో ఇదేనని జగ్గారెడ్డి వర్గాలు తెలిపాయి.తొగర్‌పల్లి సర్వే నంబర్ 418లో లబ్ధిదారులకు నిర్మలా జగ్గారెడ్డి చేతుల మీదుగా ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. 13 ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం లభించడం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, కొండాపూర్, అలియాబాద్ గ్రామాల సర్పంచులు, కొండాపూర్ తహసీల్దార్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరు సంగారెడ్డి మార్గంలో ట్రాఫిక్ దారి మళ్లింపు

**ఇస్నాపూర్ కూడలిలో వంతెన నిర్మాణ పనులు.. రెండు నెలల పాటు ఆంక్షలు**




సంగారెడ్డి**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** జాతీయ రహదారి--65పై పటాన్‌చెరు సమీపంలోని ఇస్నాపూర్ కూడలి వద్ద రెండో దశ వంతెన, వాహనాల అండర్‌పాస్ నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలకు దారి మళ్లింపు చేపట్టనున్నారు. ఈ దారి మళ్లింపు సెప్టెంబర్ 26, 2026 నుంచి రెండు నెలల పాటు అమల్లో ఉంటుందని అధికారులు తెలిపారు.పటాన్‌చెరు నుంచి కంది, సంగారెడ్డి వైపు వెళ్లే వాహనాలకు పటాన్‌చెరు నుంచి కంది, సంగారెడ్డి వైపు వెళ్లే వాహనాలను నోవాపాన్ కూడలి వద్ద దారి మళ్లించి.. కర్దనూర్ ఎక్స్ రోడ్డు -- పారిశ్రామిక అభివృద్ధి ప్రాంతం పాశమైలారం -- ఇంద్రకరణ్ -- కంది మీదుగా సంగారెడ్డి వైపు పంపించనున్నారు.ముత్తంగి నుంచి సంగారెడ్డి వైపు వచ్చే వాహనాలను బయటి వలయ రహదారి మూడో నిష్క్రమణ, ముత్తంగి నుంచి సంగారెడ్డి వైపు వచ్చే వాహనాలను బయటి వలయ రహదారి సేవా రహదారి -- ముత్తంగి -- కర్దనూర్ ఎక్స్ రోడ్డు -- పారిశ్రామిక అభివృద్ధి ప్రాంతం పాశమైలారం -- ఇంద్రకరణ్ -- కంది మీదుగా సంగారెడ్డి వైపు మళ్లించనున్నారు.దారి మళ్లింపు మార్గంలోని సేవా రహదారి ఇరుకుగా ఉండటంతో వాహనాల రద్దీ, ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సంగారెడ్డి వైపు ప్రయాణించే వాహనదారులు ముందుగానే బయలుదేరి, ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు.నిర్మాణ పనుల నేపథ్యంలో వాహనదారులు పోలీసు, ట్రాఫిక్ అధికారులు సూచించిన దారి మళ్లింపు మార్గాలను పాటించి సహకరించాలని కోరారు.

# నాచారంగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు 84 రోజులకు రూ.16.71 లక్షల ఆదాయం





నాచగిరి గుట్ట::**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** సిద్దిపేట జిల్లా వర్గల్ మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, శ్రీశ్రీశ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం (నాచారం గుట్ట) నందు బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ అధికారులు ఘనంగా నిర్వహించారు. గత 84 రోజులకు గాను భక్తులు స్వామివారికి సమర్పించుకున్న కానుకల ద్వారా మొత్తం రూ. 16,71,537/- (పదహారు లక్షల డెబ్బై ఒక్క వేల ఐదు వందల ముప్పై ఏడు రూపాయలు) ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం దేవాదాయ ధర్మాదాయ శాఖ సిద్దిపేట డివిజన్ ఇన్స్పెక్టర్ గురుభద్రమ్మ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణాధికారి (ఈవో) బెల్లంకొండ రంగాచారి మాట్లాడుతూ... భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయంలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, స్వామివారి కృపతో ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుధాకర్, నరేందర్, మాజీ ధర్మకర్త నాయక శ్రీనివాస్ లతో పాటు శ్రీ భ్రమరాంబికా సేవా సమితి, శివకేశవ సేవా సమితి సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలు అందించారు.

# వినాయక నిమజ్జన వేడుకల్లో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సందడి

**మండపాల్లో ప్రత్యేక పూజలు.. నిమజ్జన ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్న ఎమ్మెల్యే**



సంగారెడ్డి**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** : సంగారెడ్డి పట్టణంలోని పలు వినాయక మండపాలను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గొల్లగూడెంలో లాడే మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు.ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్నారు.యువకులు, నాయకులతో కలిసి ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ వేడుకల్లో సందడి చేశారు. ఎమ్మెల్యే కూడా డీజే పాటలకు నృత్యం చేస్తూ యువతలో ఉత్సాహాన్ని నింపారు.కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, చింత సాయినాథ్, 9వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి లాడే బాలు, శ్రావణ్ రెడ్డి, వాజిత్, మోహన్ సింగ్ నాయక్, చింటూ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల్లో ఘనంగా పూజలు..

**మిత్ర విహార్ కాలనీలో కన్నులపండువగా శ్రీవారి కల్యాణం**

**ముఖ్య అతిథిగా హాజరైన అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్**





అమీన్‌పూర్, **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** బీరంగూడ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో 10వ రోజు వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పటేల్‌గూడ పరిధిలోని మిత్ర విహార్ కాలనీ గణపతి మండపం వద్ద కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం భక్తుల జయజయధ్వానాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కన్నులపండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో నందారం నరసింహా గౌడ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా నందారం నరసింహా గౌడ్ మాట్లాడుతూ, వినాయక నవరాత్రుల సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం ఆధ్యాత్మికంగా ఎంతో శుభప్రదమన్నారు. గణనాథుని కరుణాకటాక్షాలు, శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో శాంతి, సద్భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.అనంతరం మండప నిర్వాహకులు నందారం నరసింహా గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎన్ఎన్‌జీ యువసేన సభ్యులు, కాలనీ ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు

200 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్‌చెరు,**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** ఒక దేశ భవిష్యత్తు నిర్మాణం తరగతి గదిలోనే జరుగుతుందని, ప్రతి విద్యార్థిని భావిభారత పౌరుడిగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరు నియోజకవర్గ స్థాయి ప్రైవేటు పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 200 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని కొనియాడారు.విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు, కుటుంబ బంధాలు, సమాజంలో వస్తున్న మార్పులపై అవగాహన కల్పిస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.పటాన్‌చెరు నియోజకవర్గంలో అధిక శాతం పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు తమ పిల్లలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారని తెలిపారు. వివిధ పాఠశాలల మధ్య పోటీ ఉన్నప్పటికీ ప్రైవేటు పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. ప్రతి రంగంలో పటాన్‌చెరు నియోజకవర్గానికి పేరు తెచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను గత 25 ఏళ్లుగా గురుపూజోత్సవం సందర్భంగా సన్మానించుకోవడం తనకు ఎంతో సంతోషంగా, అదృష్టంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు.ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్ వినియోగం ప్రమాదకరంగా మారుతోందని ఆయన అన్నారు. సాంకేతికతను మనిషి అభివృద్ధికి వినియోగిస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని, అదే సాంకేతికతను దుర్వినియోగం చేస్తే సమాజానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలోని విద్యార్థుల చదువుతో పాటు వారి మానసిక ప్రవర్తనను కూడా ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు.ఈ సందర్భంగా వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రైవేటు పాఠశాలల సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఉచిత మెగా ఆయుష్ వైద్య శిబిరం

300 మందికి పైగా రోగులకు వైద్య సేవలు..

ఉచితంగా మందులు, రక్త పరీక్షలు



సిద్దిపేట,**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం సిద్దిపేట పట్టణంలోని స్వచ్ఛ బడి ఆవరణ, పాత మాతా శిశు వైద్యశాల, బురుజు వద్ద ఉచిత మెగా ఆయుష్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ ఆయుష్ వైద్య విధానాలు ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రజలు ఆయుష్ వైద్య విధానాలు, మందులు, చికిత్సా పద్ధతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెరుగైన ఆరోగ్య ఫలితాల కోసం అవసరమైన సందర్భాల్లో ఆయుష్ వైద్య పద్ధతులను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం ద్వారా వ్యక్తిగత శ్రేయస్సుతో పాటు సమాజ, ప్రపంచ శ్రేయస్సుకు దోహదపడాలని సూచించారు.ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా ఝాన్సీ మాట్లాడుతూ తాను ఆయుష్ వైద్య విధానంలో భాగంగా కంటి సంబంధిత చికిత్స పొందగా మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఆయుష్ వైద్య విధానాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.మాజీ కౌన్సిలర్ దీప్తి నాగరాజు మాట్లాడుతూ ఆయుష్ వైద్యం శరీరం, మనస్సు, జీవనశైలిని సమగ్రంగా పరిగణించే సంపూర్ణ చికిత్సా విధానమని తెలిపారు. ఇలాంటి సమగ్ర వైద్య విధానాలు ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు సమాజాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించిన ఈ శిబిరంలో 300 మందికి పైగా రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు. దీర్ఘకాలిక వ్యాధులు, కీళ్ల నొప్పులు, ఉబ్బసం, అలెర్జీలు, మూత్రపిండాల్లో రాళ్లు, థైరాయిడ్, రక్తపోటు, మధుమేహం, చర్మ వ్యాధులు తదితర సమస్యలకు ఆయుష్ వైద్య సేవలు అందించారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.అదేవిధంగా దాదాపు 100 మందికి మధుమేహ పరీక్షలు, రక్త వర్గ నిర్ధారణ, రక్తంలోని హిమోగ్లోబిన్ స్థాయి పరీక్షలు తదితర రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఆయుష్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు.శిబిర నిర్వహణలో నోడల్ అధికారి డాక్టర్ కె. అనిల్ కుమార్, సమీకృత ఆయుష్ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాదేవి, జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ భానుతేజ, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కేదారి, డాక్టర్ సంపత్ కుమార్, యునాని వైద్యులు డాక్టర్ అజీమ్ అహ్మద్, హోమియోపతి వైద్యులు డాక్టర్ గౌతమి ప్రియ, ఔషధ విక్రేతలు శివ ప్రసాద్, జ్యోతి, ఐజాజుద్దీన్, సంతోషి రాణి, ఎస్ఎన్ఓలు వెంకటేష్, రమేష్, స్వామి, యోగా శిక్షకులు మనోహర్, రేవతి, శ్రీనివాస్, కవిత తదితరులు పాల్గొన్నారు.ప్రజలకు నాణ్యమైన ఆయుష్ వైద్య సేవలు అందించడంతో పాటు ఆయుష్ వైద్య విధానాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆయుష్ విభాగం--సిద్దిపేట జిల్లా అధికారులు తెలిపారు.

## పైసా పైసా కూడబెట్టి ప్లాట్లు కొంటే..

# రియల్ ఎస్టేట్ వివాదంలో మింగేశారంటూ ఆవేదన

రుద్రారం సాయినాథ్ గార్డెన్స్‌లో ప్లాట్ కొనుగోలుదారుల ఆందోళన

పటాన్చెరు రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా.. న్యాయం చేయాలని డిమాండ్





పటాన్‌చెరు**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** పైసా పైసా కూడబెట్టి ప్లాట్లు కొనుగోలు చేసుకున్న తమ ఆస్తులు వివాదంలో చిక్కుకోవడంతో న్యాయం కోసం ఏళ్లుగా పోరాడుతున్నామని రుద్రారం సాయినాథ్ గార్డెన్స్ ప్లాట్ కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని సాయినాథ్ గార్డెన్స్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.2004లో చట్టబద్ధంగా తాము ప్లాట్లు కొనుగోలు చేశామని బాధితులు తెలిపారు. అయితే తమకు సంబంధించిన ప్లాట్ల విషయంలో రెవెన్యూ అధికారుల సహకారంతో ఎల్ఎస్ఎంఎల్ కంపెనీ పేరుపై పట్టా పాస్‌బుక్‌లు జారీ చేసి దారి మళ్లించారని వారు ఆరోపించారు. ఈ వ్యవహారంలో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని వాపోయారు.దశాబ్దాలుగా తమ ఆస్తుల కోసం మండల రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని బాధితులు పేర్కొన్నారు. తమ ప్లాట్లను వెంటనే స్వాధీనం చేసి అసలు కొనుగోలుదారులకు అప్పగించాలని, ఈ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జీపీఆర్ లేఅవుట్‌కు సంబంధించిన మ్యూటేషన్ వ్యవహారంలో తమకు అన్యాయం జరిగిందంటూ ఆరోపిస్తూ ప్లాట్ యజమానులు నినాదాలు చేశారు. అనంతరం లేఅవుట్‌లో ధర్నా నిర్వహించారు. రెవెన్యూ అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని బాధితులు కోరారు.

# ఎంజాయ్‌మెంట్ సర్వేను అడ్డుకున్న గ్రామస్థులు

113 ఎకరాల భూమిపై హద్దులు నిర్ధారించిన తర్వాతే సర్వే చేపట్టాలని డిమాండ్



మర్కూక్**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండల పరిధిలోని శివారు వెంకటాపూర్ గ్రామ శివారులో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో రెవెన్యూ అధికారులు చేపట్టిన ఎంజాయ్‌మెంట్ సర్వేను శివారు వెంకటాపూర్ గ్రామస్థులు అడ్డుకున్నారు.సర్వే నంబర్ 325లో తమ గ్రామానికి చెందిన సుమారు 113 ఎకరాల భూమిని ఎర్రవల్లి గ్రామ రికార్డుల్లో కలిపారని గ్రామస్థులు ఆరోపించారు. తమకు సంబంధించిన భూమిపై ముందుగా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి, హద్దులను నిర్ధారించిన అనంతరం మాత్రమే సర్వే నంబర్ 325లో ఎంజాయ్‌మెంట్ సర్వే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సుమారు 100 మంది గ్రామస్థులు మర్కూక్ తహసీల్దార్ సరితను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ గ్రామానికి సంబంధించిన 113 ఎకరాల భూమిపై అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, హద్దులను స్పష్టంగా నిర్ధారించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.భూమి హక్కులు, రికార్డుల్లో నమోదైన వివరాలను పరిశీలించి న్యాయం చేయాలని గ్రామస్థులు అధికారులను కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ కె. హైమావతి




సిద్దిపేట,**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, గృహనిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ దృశ్య సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లకు మంజూరైన లబ్ధిదారుల వివరాలపై రాజపత్రిత అధికారి ధ్రువీకరణను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ధ్రువీకరణ పూర్తయిన అనంతరం సంబంధిత దస్త్రాలను కలెక్టరేట్‌కు పంపించాలని సూచించారు. ఆయా మండలాల వారీగా ప్రణాళిక రూపొందించుకుని ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు.లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఇళ్ల నిర్మాణ దశలకు అనుగుణంగా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.నిర్మాణ పనుల్లో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వారితో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులను ప్రోత్సహించి, నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమమని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఆర్థిక సహాయం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి భగవంత్ రావు, ఉప కార్యనిర్వహణ ఇంజనీర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించిన

# ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు అక్షయ్ గౌడ్



నర్సాపూర్,**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** నర్సాపూర్ లోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని ఎన్ ఎస్ యు ఐ మెదక్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ అక్షయ్ గౌడ్ నేడు ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న వసతులు, భోజనం, మౌలిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు.

# దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజం అభివృద్ధి




సిద్దిపేట,**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ), సిద్దిపేట ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ చెవిటి దినోత్సవం, అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం సందర్భంగా లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ జి. సుదర్శన్, ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, చైర్మన్ డీఎల్ఎస్ఏ సిద్దిపేట మాట్లాడుతూ సమాజంలో వినికిడి లోపం ఉన్నవారిని ఎవరూ చిన్నచూపు చూడకూడదన్నారు. వారికి అన్ని రంగాల్లో సమాన అవకాశాలు, ప్రోత్సాహం లభించినప్పుడే సమాజం నిజమైన అభివృద్ధిని సాధిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలు, వైద్య సేవలను అర్హులైన దివ్యాంగులందరూ పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చట్టపరమైన సలహాలు, ఉచిత న్యాయ సహాయం అవసరమైన పేద దివ్యాంగులకు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ సెక్రటరీ శ్రీమతి కె. సౌజన్య మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు, వారికి రావాల్సిన చట్టపరమైన ప్రయోజనాలు అందేలా తమ శాఖ తరపున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంఅండ్‌హెచ్ఓ) డాక్టర్ ధన్‌రాజ్ పాల్గొని ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను వివరించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) శ్రీ సి.ఏ.ఆర్. సుధీర్ మాట్లాడుతూ దివ్యాంగుల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు.యూడీఐడీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అనిత మాట్లాడుతూ యూనిక్ డిజెబిలిటీ ఐడీ (యూడీఐడీ) కార్డుల ప్రాముఖ్యతను, వాటి కోసం దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించారు. జిల్లా సంక్షేమ అధికారి (డీడబ్ల్యూఓ) శ్రీమతి సిహెచ్. శారద మాట్లాడుతూ మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా దివ్యాంగులకు అందుతున్న సహాయ సహకారాలను వివరించారు.ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు అధికారులు, న్యాయమూర్తుల చేతుల మీదుగా యూడీఐడీ సర్టిఫికెట్లను అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు, రాయితీలు పొందేందుకు ఈ సర్టిఫికెట్లు ఎంతో దోహదపడతాయని అధికారులు తెలిపారు.అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేస్తూ సంకేత భాషా నిపుణులు వేదికపై చేతులతో సైగలు చేస్తూ సంకేత భాషలో భావయుక్తంగా మాట్లాడారు. మూగ, చెవిటి వారు తమ భావాలను ఇతరులకు ఏ విధంగా వ్యక్తపరుస్తారో సైగల ద్వారా అందరికీ అర్థమయ్యేలా వివరించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో డాక్టర్ డి. హరికృష్ణ, జి. శ్రావణి, వైద్య సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది, దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పిఏం కిసాన్, రైతు భరోసా కోసం ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

మనియర్ పల్లిలో జరిగిన రైతు అవగాహనా సదస్సులో సర్పంచ్ రాజ్ కుమార్



జహీరాబాద్ **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** కోహిర్ మండలంలోని మనియర్ పల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన రైతుల అవగాహనా సమావేశంలో రైతులకు ఏఓ కీలక సూచనలు ఇచ్చారు. సర్పంచ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని, దాని కోసం కావలసిన పత్రాలు పట్టాదార్ పాస్ బుక్కు, ఆధార్ కార్డు జిరాక్స్, చెలామణిలో బ్యాంకు ఖాతాను రైతు వేదికల్లో గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులకు ఇచ్చినట్టయితే వారు ఆన్లైన్ లో రిజిస్టర్ ప్రక్రియను పూర్తి చేస్తారని, ప్రక్రియ పూర్తైనా రైతులకే ప్రయోజనాలు చేకూరాతాయని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ ఏఈఓ, వార్డు సభ్యులు, రైతులు, రైతు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## నాగులపల్లిలో కలుషితమవుతున్న

# మిషన్ భగీరథ తాగునీరు పట్టించుకోని అధికారులు



నర్సాపూర్, **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** నర్సాపూర్ మండలం నాగులపల్లి గ్రామానికి సరఫరా అవుతున్న మిషన్ భగీరథ తాగునీరు కలుషితమవుతుండటంతో గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నాగులపల్లి - మూసాపేట గ్రామాల మధ్య మిషన్ భగీరథ ప్రధాన పైప్ లైన్ పగిలిపోవడంతో తాగునీటిలో మట్టి, మలినాలు, క్రిమి కీటకాలు వస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.గత నెల రోజులుగా ఈ సమస్యపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోతున్నారు. వర్షాకాలం కావడంతో పగిలిన పైపు లైన్ నుంచి కలుషిత నీరు చేరే ప్రమాదం ఉందని, దీంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పగిలిన పైప్ లైన్ ను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టి, గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని నాగులపల్లి గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## హత్నూరలోని వీఎస్పీ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమలో ఐటీ అధికారుల సోదాలు




నర్సాపూర్ /హత్నూర, **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని వీఎస్పీ ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ స్టీల్ పరిశ్రమలో ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) అధికారులు బుధవారం సోదాలు నిర్వహిస్తున్నారు.బుధవారం ఉదయం సుమారు 5 గంటల నుంచి అధికారులు పరిశ్రమలోకి చేరుకుని తనిఖీలు ప్రారంభించారు. పరిశ్రమకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, రికార్డులు, కీలక పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.అయితే ఈ సోదాలు ఏ అంశానికి సంబంధించి చేపడుతున్నారనే దానిపై అధికారులు అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు.ఉదయం నుంచి సోదాలు నిరంతరాయంగా కొనసాగుతుండటంతో పరిశ్రమ పరిసరాల్లో ఉత్కంఠ నెలకొంది. సోదాలు పూర్తయిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## పటాన్‌చెరులో క్యాబ్ డ్రైవర్

# హత్య కేసు ఛేదించిన సైబరాబాద్ పోలీసులు

ముగ్గురు నిందితుల అరెస్ట్.. మరో ఇద్దరి కోసం గాలింపు:శ్రీనివాస్, డీసీపీ శేరిలింగంపల్లి




గచ్చిబౌలి**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 : :** పటాన్‌చెరు పరిధిలో సంచలనం సృష్టించిన క్యాబ్ డ్రైవర్ హత్య, దోపిడీ కేసును సైబరాబాద్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన ఘోడకే రాహుల్, సూరజ్ శశికాంత్, బాంబ్లే రాజులను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 10వ తేదీ రాత్రి సికింద్రాబాద్‌లో ముంబై వెళ్లాలంటూ నిందితులు క్యాబ్ డ్రైవర్ నెలమర్రి రాజశేఖర్ వాహనాన్ని మాట్లాడుకున్నారు. మార్గమధ్యంలో పటాన్‌చెరు సమీపంలోని రుద్రారం వద్ద టవల్‌తో గొంతు నులిమి డ్రైవర్‌ను హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు.అనంతరం మృతదేహాన్ని బ్రిడ్జి వద్ద పడేసి క్యాబ్‌తో ముంబై వైపు పరారయ్యేందుకు ప్రయత్నించారు. అయితే కోహిర్ వద్ద వాహనం మొరాయించడంతో కారును అక్కడే వదిలేసి నిందితులు పరారైనట్లు పోలీసులు తెలిపారు.బంగారు దుకాణాల్లో చోరీలకు క్యాబ్‌ను ఉపయోగించి, అనంతరం వాహనాన్ని విక్రయించాలని నిందితులు ప్రణాళిక రూపొందించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం.కేసు దర్యాప్తులో భాగంగా ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## జూలూరు నర్సింహులు మృతి పట్ల

# నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి సంతాపం





నర్సాపూర్ /హత్నూర,**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** హత్నూర మండలం చింతలచెరువు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూలూరు నర్సింహులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.విషయం తెలుసుకున్న నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి నేడు వారి స్వగ్రామానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ నర్సింహులు అకాల మరణం పార్టీకి, గ్రామానికి తీరని లోటని, ఆయన పార్టీ బలోపేతానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## పటాన్‌చెరులో ఘనంగా

# ప్రైవేట్ పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ టీచర్ సి. బిందు ఎంపిక

విద్యార్థులను అన్ని రంగాల్లో ముందుండేలా తీర్చిదిద్దడమే లక్ష్యం -- ప్రిన్సిపాల్ సి.హెచ్. రాజేష్




పటాన్‌చెరు,**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ప్రైవేట్ పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముత్తంగి కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 2010 సంవత్సరం నుంచి ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్న సి. బిందు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్. రాజేష్ మాట్లాడుతూ.. భవిష్యత్ భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దడమే తమ పాఠశాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

## నర్సాపూర్ లో ఆరవ జాతీయ

# ఔషధ భద్రతా వారోత్సవాలు ఘనంగా ముగింపు



నర్సాపూర్, **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** విష్ణు ఔషధ విద్యా పరిశోధనా సంస్థ, నర్సాపూర్ నందు భారతీయ ఔషధ సంఘం సహకారంతో ఆరవ జాతీయ ఔషధ భద్రతా వారోత్సవాలను సెప్టెంబరు 17 నుండి 23 వరకు ఘనంగా నిర్వహించారు.ఔషధ భద్రత ద్వారా ఔషధాల హేతుబద్ధ వినియోగాన్ని ప్రోత్సహించడం - సురక్షిత ఆరోగ్య సంరక్షణ వైపు ఒక అడుగు అనే ప్రధాన ఇతివృత్తంతో ఈ కార్యక్రమాలను నిర్వహించారు.వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు నినాదాల రచన, చీటీలను విడదీసి చదవడం, విద్యార్థుల ఔషధ సేవనం మరియు జీవనశైలి భద్రతా సర్వే, ఔషధ భద్రతా ముగ్గులు, ముగింపు వేడుక వంటి పలు కార్యక్రమాలను నిర్వహించారు.సెప్టెంబరు 23న చండీగఢ్ లోని వైద్య విద్యా పరిశోధనా సంస్థకు చెందిన ఔషధ శాస్త్ర ఆచార్యులు వైద్యులు బికాష్ మేధి అంతర్జాలం ద్వారా ప్రత్యేక అతిథి ఉపన్యాసం అందించారు. ఔషధాల సురక్షిత వినియోగం మరియు ఔషధ భద్రతా ప్రాముఖ్యతపై ఆయన అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమాలను సంస్థ ప్రధానాచార్యులు వైద్యులు ఏ. రమేష్ సమన్వయకర్తగా, ఔషధ శాస్త్ర విభాగాధిపతి వైద్యులు పి. రాజశేఖర్ సహ సమన్వయకర్తగా, వైద్యులు ఎం. శ్రీ చందన, వైద్యులు పి. మనసా తదితర ఆచార్యులు నిర్వాహకులుగా విజయవంతంగా నిర్వహించారు.ప్రతి నివేదిక ఒక సురక్షిత ప్రపంచానికి అడుగు అనే సందేశంతో విద్యార్థులు, ఆచార్యులు మరియు ప్రజలలో ఔషధ భద్రతపై అవగాహన పెంపొందించడమే ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

ప్రజా పిలుపు
ప్రజల గొంతు - ప్రజల కోసం
PEOPLE VOICE
PRAJA PILUPU RNI:TGTEL/26/A5230



# క్యాబ్ డ్రైవర్ హత్య కేసులో ముగ్గురి అరెస్టు

## మరో ఇద్దరి కోసం పోలీసుల గాలింపు



పటాన్‌చెరు **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** క్యాబ్ డ్రైవర్‌ను హత్య చేసి కారును అపహరించిన కేసును పటాన్‌చెరు పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబరు 10, 11 తేదీల మధ్య రాత్రి ఐదుగురు నిందితులు సికింద్రాబాద్ నుంచి ముంబయికి వెళ్లాలని చెప్పి క్యాబ్ డ్రైవర్ నెలమర్రి రాజశేఖర్ కారును అద్దెకు తీసుకున్నారు. రుద్రారం గ్రామ శివారుకు చేరుకున్న తర్వాత డ్రైవర్‌పై దాడి చేసి టవల్‌తో గొంతు బిగించి హత్య చేశారు. మృతదేహాన్ని నిర్మాణంలో ఉన్న రోడ్డు పైవంతెన సమీపంలో పడేసి కారులో ముంబయి వైపు వెళ్లారు. కోహీర్ వద్ద కారు చెడిపోవడంతో గోల్డెన్ ధాబా సమీపంలో వదిలేసి జహీరాబాద్ వైపు వెళ్లారు.ముంబయిలో బంగారు దుకాణాల్లో దొంగతనాలు చేసి, అనంతరం కారును విక్రయించాలని నిందితులు పథకం వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో ఆధారాలు సేకరించి ఘోడకే రాహుల్ (28), సూరజ్ శశికాంత్ తావడే (29), బాంబ్లే రాజు రామచంద్ర (33)లను అరెస్టు చేశారు. వీరంతా మహారాష్ట్రకు చెందినవారు.మయూర్ రాజేంద్ర దివేకర్, శివ శంకర్ శర్మ పరారీలో ఉన్నారు. వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోంది.అరెస్టయిన నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, ఏసీపీ సీహెచ్‌వై. శ్రీనివాస్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఎం. రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసును ఛేదించారు.

# హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలి:జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి,**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్ల ధ్రువపత్రాల పరిశీలన, హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ సంగీతతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కింగ్ కాని, అనామలీ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి సమర్పిస్తున్న ధ్రువపత్రాలను త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.నోటీసులు అందుకున్న ఓటర్లు 12 రకాల గుర్తింపు, ధ్రువపత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించాలని తెలిపారు. హియరింగ్‌కు హాజరై అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించేలా బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.జిల్లాలో 4,11,717 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా.. ఇప్పటివరకు 2,48,395 మంది ఓటర్ల హియరింగ్ ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు.సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంగీత, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జాతి నిర్మాణంలో యువత పాత్ర కీలకం




పటాన్‌చెరు**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** జాతి నిర్మాణంలో యువత పాత్ర కీలకమని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ అన్నారు.జాతీయ సేవా పథకం, యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో కళాశాలలో వివిధ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 24న జాతీయ సేవా పథకం స్థాపిత దినోత్సవ వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో వ్యాసరచన, పాటల పోటీలు, వక్తృత్వం, పోస్టర్ తయారీ, స్కిట్, నృత్య ప్రదర్శన తదితర పోటీలు నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ప్రొఫెసర్ ఆకుల వెంకటేశం, డాక్టర్ కరుణకుమారి తెలిపారు.పోటీలకు డాక్టర్ మంజుశ్రీ, షరీఫ్ మియా, ఉమాదేవి, స్రవంతి తదితర అధ్యాపకులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు




పటాన్చెరు **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్ల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం ప్రవీణా తెలిపారు. డిగ్రీలో అడ్మిషన్లు పొందుటకు గత విడతలలో అవకాశం పొందని విద్యార్థుల కొరకు కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనరేట్ వారు డిగ్రీ స్పాట్ అడ్మిషన్ల కొరకై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 24 25 తేదీలలో కళాశాలలో దరఖాస్తులు సమర్పించి, 28 29 తేదీలలో జరుగు స్పాట్ అడ్మిషన్లకు కళాశాలలో హాజరుకావాలని ప్రిన్సిపల్ కోరారు.మొత్తం 960 సీట్ల గాను 206 సీట్లు ఖాళీగా ఉన్నట్లు అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ పి సుజాత తెలిపారు. ప్రస్తుత అకాడమిక్ సంవత్సరానికి సంబంధించి డిగ్రీ అడ్మిషన్లకు చిట్ట చివరి అవకాశం అని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# వివిధ గణేష్ మండపాల్లో సింధు ఆదర్శ్ రెడ్డి పూజలు





పటాన్‌చెరు **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** పటాన్ చేరు నియోజకవర్గంలోని భారతీనగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాలను మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి అన్నప్రసాద కార్యక్రమాల్లో పాల్గొన్నారు.బీడీఎల్ కాలనీ, మ్యాక్ సొసైటీ, ఓల్డ్ ఎంఐజీ కాలనీల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను ఆమె సందర్శించారు. అనంతరం బాంబే కాలనీలో వైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన గణేష్ పూజలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా మండపాల్లో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాల్లో స్థానిక భక్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ వైర్లు, కేబుల్ చోరీ కేసుల్లో 10 మంది అరెస్ట్

## 13 కేసులకు సంబంధించి రూ.7.50 లక్షల విలువైన సామగ్రి స్వాధీనం

## రూ.4 లక్షల విలువైన టాటా ఏస్ వాహనం, 10 మొబైల్ ఫోన్లు స్వాధీనం




సంగారెడ్డి **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** విద్యుత్ వైర్లు, కేబుల్ చోరీ కేసులకు సంబంధించి 10 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,50,767 విలువైన కేబుల్ వైర్లు, అల్యూమినియం వైర్లు, రూ.4 లక్షల విలువైన టాటా ఏస్ వాహనం, 10 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.హీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. హద్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన విద్యుత్ వైర్లు, కేబుల్ చోరీ కేసులకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ముంగి పంప్‌హౌస్‌లో విద్యుత్ మోటార్లకు సంబంధించిన ఇంపెల్లర్, పంప్ షాఫ్ట్, వేర్ రింగ్స్, బుషెస్, కనెక్టింగ్ రాడ్స్ తదితర సామగ్రి చోరీకి గురైన ఘటనపై హద్నూర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 75/2026 కింద కేసు నమోదు చేశారు.జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జహీరాబాద్ సబ్ డివిజన్ పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 22న వాహన తనిఖీలు చేపడుతున్న హద్నూర్ పోలీసులకు అనుమానాస్పదంగా వెళ్తున్న టాటా ఏస్ వాహనం కనిపించింది. దీంతో పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న వ్యక్తులను విచారించగా చోరీలకు సంబంధించిన వివరాలు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.దర్యాప్తులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం 13 చోరీ కేసులతో నిందితులకు సంబంధం ఉన్నట్లు గుర్తించారు. హద్నూర్, జహీరాబాద్ రూరల్, మానూర్, ఝరాసంగం, కోహీర్, జోగిపేట, నారాయణఖేడ్, కల్హేర్, రాయికోడ్, జహీరాబాద్ టౌన్, కొండాపూర్ తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులు ఇందులో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.ఈ కేసుల్లో రూ.7,50,767 విలువైన కేబుల్ వైర్లు, అల్యూమినియం వైర్లు, రూ.4,00,000 విలువైన టాటా ఏస్ వాహనం, 10 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసుకు సంబంధించి మరింత దర్యాప్తు కొనసాగుతోందని జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్ వెల్లడించారు.

# తెలంగాణకు సునీల్ భన్సల్- ఏపీకి అరవింద్ భదౌరియా రాష్ట్రాలకు కొత్త ఇన్‌ఛార్జ్?లను ప్రకటించిన బీజేపీ

## హరియాణా, ఛత్తీస్‌గఢ్‌లకు ఇన్‌ఛార్జిగా స్మృతి ఇరానీ- 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు కొత్తగా ఇన్‌ఛార్జిలను, కో-ఇన్‌ఛార్జిలను నియమిస్తూ ఆదేశాలు

భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులకు అధిష్ఠానం రాష్ట్రాల బాధ్యతలను అప్పగించింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు కొత్తగా ఇన్‌ఛార్జిలను, కో-ఇన్‌ఛార్జిలను నియమించింది. ఏపీకి ఇన్‌ఛార్జ్?గా అరవింద్ భదౌరియా, తెలంగాణ ఇన్‌ఛార్జ్?గా సునీల్ భన్సల్‌ను నియమిస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బంగాల్ బాధ్యతలను కూడా సునీల్ భన్సల్‌కు అప్పగించారు. అనిల్ బలూని బీజేపీ కమ్యూనికేషన్ సెల్ కో-ఆర్డినేటర్‌గా, ఆశిష్ అగర్వాల్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ చేసిన ఈ నియామకాలన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయి అని పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. దేశ రాజధాని దిల్లీకి వినయ్ సహస్రబుద్ధేను ఇన్‌ఛార్జిగా నియమించారు. సీనియర్ బీజేపీ నేత వినయ్ సహస్రబుద్ధే దిల్లీకి ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించనుండగా, జమ్‌యాంగ్ సెరింగ్ నామ్‌గ్యాల్, దర్శన జర్దోష్ సహ-ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటారు. హరియాణా, ఛత్తీస్‌గఢ్‌లకు స్మృతి ఇరానీ ఇన్‌ఛార్జ్?గా వ్యవహరించనున్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి ఒడిశా ఇన్‌ఛార్జ్?గా బాధ్యతలు అప్పగించారు. పార్టీ ఉపాధ్యక్షుడు రామ్ మాధవ్‌కు తమిళనాడు, ఉత్తరాఖండ్ రాష్ట్రాల బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

### ఎన్నికలు జరిగే రాష్ట్రాలపై బీజేపీ ఫోకస్?

వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలపైన బీజేపీ దృష్టి సారించారు. ఈ మేరకు బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డేను ఉత్తరప్రదేశ్ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. జగదీష్ పటేల్, మేధా కులకర్ణి, ప్రదీప్ వర్మ, ఆనంద్ ఓజా సహ-ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరిస్తారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న మరో రాష్ట్రమైన గుజరాత్‌కు రాజ్యసభ ఎంపీ తరుణ్ చుగ్ ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. పంజాబ్‌తో పాటు జమ్మూ కాశ్మీర్‌కు సతీష్ పూనియాను ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. దిల్లీ బీజేపీ మాజీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా, రాజ్యసభ ఎంపీ అల్కా గుర్జార్‌లను సహ-ఇన్‌ఛార్జ్‌లుగా నియమించారు. అటు ఎన్నికలు జరిగే మణిపుర్ బాధ్యతలను అసోంకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాజీవ్ రాయ్‌కు అప్పగించారు. కేంద్ర మాజీ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్‌కు గోవా బాధ్యతలు అప్పగించారు. బీజేపీ ఉపాధ్యక్షుడు బైజయంతి జై పాండాను మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా నియమించగా, అమిత్ మాలవీయ, సదానంద షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్ సహ-ఇన్‌ఛార్జ్‌లుగా నియమితులయ్యారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి స్మృతి ఇరానీకి హరియాణ, ఛత్తీస్‌గఢ్ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించగా, మరో జాతీయ ప్రధాన కార్యదర్శి హరీష్ ద్వివేది బిహార్, కర్ణాటక రాష్ట్రాలకు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తారు. జాతీయ కార్యదర్శి స్వదేశ్ సింగ్ సహ-ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తారు. త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లవ్ కుమార్ దేబ్‌ను మధ్యప్రదేశ్ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు.



### కొత్త టీమ్‌తో ఎన్నికల వ్యూహం

ఇదిలా ఉండగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కొత్త టీమ్‌ను ఇటీవలె ప్రకటించారు. అనుభవజ్ఞులతో పాటు యువ నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తూ కొత్త బృందాన్ని నియమించారు. జాతీయ ప్రధాన కార్యదర్శులుగా అమేఠీ మాజీ ఎంపీ స్మృతి ఇరానీ, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్ దేబ్, సునీల్ బన్సల్, వినోద్ తావ్డే, సతీశ్ పూనియా, గజేంద్ర పటేల్, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియాలకు కీలక బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో పలువురు సీనియర్ నేతలను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు. మాజీ రాజస్థాన్ సీఎం వసుంధరా రాజే, మాజీ ఉత్తరాఖండ్ సీఎం తీరథ్ సింగ్ రావత్, రామ్ మాధవ్, బైజయంత్ పాండా, డీ పురందేశ్వరి తదితరులకు ఈ జాబితాలో చోటు దక్కింది. మొత్తం 13 మంది కొత్త ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు ఉండటం

# ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని సమన్వయంతో నిర్వహించాలి

## ట్రైని డిప్యూటీ కలెక్టర్ భవ్య




సిద్దిపేట, **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** ఈ నెల 27న నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవ కార్యక్రమాలను జిల్లాలో సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ట్రైని డిప్యూటీ కలెక్టర్ భవ్య అధికారులను ఆదేశించారు. బుధవారం సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని సుమారు 150 మంది విద్యార్థులతో పర్యాటక ప్రాంతాల సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక, పర్యావరణ పర్యాటక ప్రాంతాలను ఎంపిక చేసి విద్యార్థులకు సందర్శన ఏర్పాటు చేయాలన్నారు.పర్యాటక ప్రాంతాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఆహార ఉత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా పర్యాటక నోడల్ అధికారి విజయ్ భార్గవ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా ఇరిగేషన్ అధికారి నాగరాజు, విద్య, రవాణా, మున్సిపల్, యువజన, క్రీడలు, కొమరవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# జూద కేసులో ఇద్దరికి 30 రోజుల రిమాండ్, 8 మందికి జరిమానా




నర్సాపూర్,**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2025లో నమోదైన టీఎస్ గేమింగ్ చట్టం కేసులో ఇద్దరు నిందితులకు 30 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ నర్సాపూర్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ బాల్ రెడ్డి తీర్పు వెలువరించారు. దోషులుగా తేలిన అహ్మద్ నగర్ కు చెందిన బేగరి కుమార్, జనకంపేట్ కు చెందిన జక్కుల నర్సింలుకు రిమాండ్ విధించగా, మిగిలిన 8 మందికి ఒక్కొక్కరికి రూ.3 వేల జరిమానా విధించారు.ఈ కేసును ఎస్ఐపి ఎ. రంజిత్ కుమార్ దర్యాప్తు చేయగా, స్టేషన్ రైటర్ బి. సురేష్, కోర్టు కానిస్టేబుల్ హరిబాబు గౌడ్ సహకరించారు.

# ఒగ్గు డోల్ల మోతతో వినాయక నిమజ్జనం



రామచంద్రపురం,**ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలో వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వినాయకుడికి నిర్వాహకులు తొమ్మిది రోజుల పాటు ఘనంగా పూజలు నిర్వహించారు. బుధవారం తొమ్మిది రోజుల పూజలు ముగియడంతో నిమజ్జన కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఒగ్గు డోల్ల మోతల మధ్య వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం స్థానిక చెరువులో గణనాథుడిని నిమజ్జనం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి వీడ్కోలు పలికారు.వినాయకుడి తొమ్మిది రోజుల పూజల అనంతరం నిర్వహించిన నిమజ్జన వేడుకల్లో ఒగ్గు కళాకారుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జనగామ జిల్లా నారాయణపురం నుంచి ప్రత్యేకంగా వచ్చిన ఒగ్గు కళాకారులు నెత్తిన పసుపు రుమాలు, పసుపు రంగు దోతీలు ధరించి, కాళ్లకు గజ్జెలు కట్టుకుని ఒగ్గు డోల్లు వాయిస్తూ నృత్యాలు చేశారు.వారి సంప్రదాయ వేషధారణ, డోల్ల మోత, నృత్య ప్రదర్శనలు భక్తులను, స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఒగ్గు కళాకారులు అజిత్, రైన్ బాబు, కుమార్, వినోద్, రాజు, చందు, వినయ్, శీను, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏటీఎంల భద్రత పటిష్టం చేయాలి తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్






నర్సాపూర్ /తూప్రాన్, **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** ఏటీఎంల వద్ద జరుగుతున్న చోరీల నేపథ్యంలో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని తూప్రాన్ డీఎస్పీ జె. నరేందర్ గౌడ్ సూచించారు.బుధవారం తూప్రాన్ లో ఎస్బీఐ ఏటీఎం విభాగ అధికారులతో సమావేశమైన ఆయన, పాత యంత్రాల స్థానంలో ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేయాలని, ప్రతి కేంద్రంలో 24 గంటలు భద్రతా సిబ్బంది, నాణ్యమైన సీసీ కెమెరాలు, అత్యవసర భద్రతా వ్యవస్థ ఉండాలని సూచించారు.ఈ సమావేశంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు సైదా, జార్జ్, ఎస్బీఐ అధికారులు రాజేష్ ప్రసాద్, జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలిగా షెహనాజ్ బేగంకు అవార్డు




ఇస్నాపూర్, **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్‌లోని సెయింట్ మేరీస్ గ్రామర్ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయురాలు షెహనాజ్ బేగం ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జి. విలియం జేమ్స్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులే పాఠశాలకు ప్రధాన స్తంభాలని అన్నారు. విద్యార్థులకు విద్యాబోధన అందించడంలో ఉపాధ్యాయులు ఎన్నో త్యాగాలు చేస్తారని తెలిపారు. విద్యార్థుల భోజనం పాడైపోయిన సందర్భాల్లో తమ భోజనాన్ని సైతం వారితో పంచుకుంటారని, పరీక్షల సమయంలో కుటుంబ పరిస్థితులను పక్కనపెట్టి విధులకు హాజరవుతారని పేర్కొన్నారు.ప్రస్తుత తరం విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ జ్ఞానాన్ని నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు.విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకున్నప్పుడు ఉపాధ్యాయులు ఎంతో గర్వపడతారని అన్నారు. విద్యార్థులను బాధ్యతాయుతమైన, మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జి. విలియం జేమ్స్ తెలిపారు.

# 12వ వార్డులో ఘనంగా వినాయక నిమజ్జనం



శంకర్‌పల్లి **ప్రజా పిలుపు సెప్టెంబర్ 23 :** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో సామూహిక వినాయక నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. వినాయక చవితి ఉత్సవాల అనంతరం నిర్వహించిన నిమజ్జన కార్యక్రమంలో చిన్నా పెద్దా తేడా లేకుండా భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు చేసుకున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. డప్పులు, భక్తి గీతాలు, నృత్యాలతో పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, మహిళలు, భక్తులు పాల్గొని విజయవంతం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు, సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

## బంగారం, వెండి కాదు.. ఇప్పుడు దీనిదే హవా.. ఆ దెబ్బకు 4 ఏళ్ల రికార్డులు బద్దలు..



ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల కారణంగా కీలకమైన సరఫరా మార్గాలు మూతపడటంతో అంతర్జాతీయ మార్కెట్లో అల్యూమినియం ధరలు గత నాలుగేళ్ల గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఒకవైపు బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతుంటే, పరిశ్రమలకు కీలకమైన ఈ సిల్వర్ మెటల్ మాత్రం ఆకాశమే హద్దుగా దూసుకుపోతోంది. అసలు ఈ ధరల పెరుగుదలకు కారణాలేంటి? భారత మార్కెట్‌పై దీని ప్రభావం ఎలా ఉండబోతోంది? పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ కమోడిటీ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. ముఖ్యంగా పారిశ్రామిక లోహమైన అల్యూమినియం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. సరఫరా గొలుసులో అంతరాయం ఏర్పడుతుందనే భయాందోళనల మధ్య, సోమవారం అల్యూమినియం ధరలు గత నాలుగు ఏళ్లలో ఎన్నడూ లేనంత గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో అల్యూమినియం ధరల జోరు మామూలుగా లేదు.

లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్: మూడు నెలల బెంచ్‌మార్క్ అల్యూమినియం ధర టన్నుకు 3,544 డాలర్లను తాకింది. ఇది మార్చి 2022 తర్వాత అత్యధికం.

షాంఘై ఫ్యూచర్స్ ఎక్స్ఛేంజ్: ఇక్కడ ధరలు 3.29శాతం పెరిగి 25,310 యువాన్లకు (3,658 డాలర్లకు) చేరుకున్నాయి.

భారత మార్కెట్: మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో కిలో అల్యూమినియం ధర 3శాతం పెరిగి రూ.350.90 వద్ద ట్రేడ్ అవుతోంది.

### ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు

ప్రపంచ అల్యూమినియం ఉత్పత్తిలో సుమారు 9శాతం వాటా కలిగిన కీలకమైన గల్ఫ్ జలమార్గం హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణాకు అంతరాయం కలగడం ప్రధాన కారణం. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ వాతావరణం ఈ మార్గాన్ని ప్రమాదంలో పడేసింది. ఖతార్‌కు చెందిన ఖతాలమ్ స్మెల్టర్ తన ఉత్పత్తిని తగ్గించడం, అలాగే అల్యూమినియం బహ్రెయిన్ షిప్‌మెంట్‌లపై ఫోర్స్ మేజర్ ప్రకటించడంతో మార్కెట్ ఒక్కసారిగా వేడెక్కింది. అల్యూమినియం తయారీకి భారీగా విద్యుత్ అవసరం. యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం కలిగితే, స్మెల్టర్ల పనితీరు దెబ్బతింటుందనే ఆందోళన నెలకొంది.

### బంగారం, వెండి ధరల్లో భిన్నమైన ధోరణి

సాధారణంగా యుద్ధ సమయాల్లో బంగారం ధరలు పెరుగుతాయి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో డాలర్ బలంగా ఉండటంతో బులియన్ మార్కెట్ ఒత్తిడికి లోనైంది. బంగారం, వెండి ధరలు దాదాపు 3.5శాతం వరకు పతనమవ్వడం గమనార్హం. ప్రస్తుతం వీజశలో బంగారం ధర రూ.1.61 లక్షల కంటే తక్కువకు పడిపోయింది.

### ముందు ధరలు ఎలా ఉండవచ్చు?

కోటక్ సెక్యూరిటీస్ నిపుణుడు అనింద్య బెనర్జీ అభిప్రాయం ప్రకారం.. మధ్యప్రాచ్యం ఏటా 65 లక్షల టన్నుల అల్యూమినియంను ఉత్పత్తి చేస్తుంది. సరఫరా గొలుసులో ఇబ్బందులు కొనసాగితే ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో అల్యూమినియం ధర టన్నుకు 3,800 డాలర్ల నుండి 4,000 డాలర్ల వరకు చేరే అవకాశం ఉంది అని ×చీ+ కమోడిటీ స్ట్రాటజిస్ట్ ఎవా మాంథే అంచనా వేశారు. నిర్మాణ రంగం, ప్యాకేజింగ్, ఆటోమొబైల్ పరిశ్రమల్లో అల్యూమినియం వాడకం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఈ ధరల పెరుగుదల ఆయా రంగాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

## ఎన్ని సంవత్సరాలు రెంట్‌కి ఉంటే.. అద్దె ఇల్లు సొంతమవుతుంది.? ఎవ్వరికీ తెలియని నిజం




అద్దెకున్న వ్యక్తులు 12 సంవత్సరాలకు పైగా అద్దె చెల్లిస్తే ఆస్తికి యజమానులుగా మారతారనేది ఒక అపోహ. అయితే, భారతీయ చట్టాల ప్రకారం, అద్దెదారుడు అద్దె చెల్లిస్తూనే ఉంటే శాశ్వత అద్దెదారుడిగా మారతారే తప్ప, ఆస్తి యాజమాని టైటిల్ డీడ్ ద్వారా మాత్రమే బదిలీ అవుతుంది. యజమాని ఆస్తి పన్ను చెల్లింపుదారుగా కొనసాగుతాడు. అద్దెకున్న వ్యక్తులు ఆస్తికి పూర్తి యజమానిగా మారగలడా? అనే ప్రశ్న అనేక మందిలో గందరగోళాన్ని సృష్టిస్తుంది. అద్దెదారులు, యజమానుల మధ్య ఆస్తి హక్కులు, బాధ్యతలు, ముఖ్యంగా దీర్ఘకాలిక అద్దెకు సంబంధించిన చట్టపరమైన అంశాలను ఇప్పుడు తెలుసుకుందామా.. అద్దెదారుడు 12 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం అద్దె చెల్లిస్తూ ఉంటే, ఆ ఆస్తి అతనికి సొంతం అవుతుందనే ఒక అపోహ ఉంది. అయితే, వాస్తవ చట్టపరమైన స్థితిని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

### అద్దెదారుడి పట్ల యజమానుల తీరు, అద్దెదారుడి సమస్యలు:

అద్దె ఇళ్లల్లో నివసించేవారు అనేక సవాళ్లను ఎదుర్కొంటారు. ఉదాహరణకు, 25 సంవత్సరాలకు లీజుకు ఇచ్చిన షాపులను, గడువు ముగియకముందే మూడు రోజుల్లో ఖాళీ చేయమని ఆదేశించారు. జిమ్ వంటివి దశాబ్దాలుగా అద్దెకు నడుస్తున్నప్పటికీ, కొత్త యజమానులు ఖాళీ చేయమంటే తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. దీర్ఘకాలం ఒకేచోట వ్యాపారం చేయడం వల్ల ఏర్పడిన కస్టమర్ బేస్, సెటిల్మెంట్ వదిలి వెళ్లడం అద్దెదారులకు కష్టతరం. యజమానులు రెంట్ పెంచడం లేదా సమస్యలు సృష్టించడం ద్వారా వారిని ఖాళీ చేయించే ప్రయత్నాలు చేస్తుంటారు.

### యజమానుల సమస్యలు, 12 సంవత్సరాల నిబంధన:

అద్దెదారులకు సమస్యలు ఉన్నట్టే, యజమానులకు కూడా కొన్ని సవాళ్లు ఉంటాయి. కొందరు అద్దెదారులు దీర్ఘకాలం ఒక ఆస్తిలో నివసిస్తున్నప్పుడు, "12 ఏళ్లు దాటితే ఇది నాదే" అని వాదిస్తారు. దీనికి ఢిల్లీలోని కరోల్ బాగ్ ఉదాహరణ. అక్కడ ఒక ఆస్తిని 150 రూపాయల అద్దెకు తీసుకుని 50 సంవత్సరాలుగా ఖాళీ చేయకుండా ఉన్న సందర్భం ఉంది. హైదరాబాదులోని ఓల్డ్ సిటీలో వక్ఫ్ బోర్డు ఆస్తుల్లో కొందరు నెలకి ఐదు రూపాయల అద్దె కడుతూ 50 ఏళ్లుగా ఉంటున్నారు. ఇక్కడ కీలకమైన అంశం ఏమిటంటే, 12 సంవత్సరాల నిబంధన అద్దెదారుకు ఆస్తిపై యాజమాని హక్కులను కల్పించదు. చట్టం దృష్టిలో, మీరు "శాశ్వత అద్దెదారు"గా మాత్రమే ఉంటారు.

### చట్టపరమైన వివరణ -- యాజమాని ఎం. శాశ్వత అద్దె:

భారతీయ చట్టం ప్రకారం, 12 సంవత్సరాలకు పైగా అద్దె చెల్లించినప్పటికీ, అద్దెదారు ఆస్తికి యజమానిగా మారడు. యజమానిని టైటిల్ డీడ్ ద్వారా నిర్ణయిస్తారు. ప్రాపర్టీ టాక్స్ ఎప్పుడూ ఆస్తి యజమాని పేరు మీదే ఉంటుంది. యజమానే దానిని చెల్లిస్తాడు. అద్దెదారుడు తన పేరు మీద ప్రాపర్టీ టాక్స్ రసీదు తెచ్చుకున్నా లేదా ఇతర బిల్లులను(ఎలక్ట్రిసిటీ, వాటర్) తన పేరు మీద మార్చుకున్నా, అది అతనికి టైటిల్ డీడ్ హక్కును ఇవ్వదు. యజమానిగా కావాలంటే, సదరు యజమాని ఆస్తిని అమ్మడానికి అంగీకరించాలి. అందుకు సంబంధించిన చట్టపరమైన పత్రాలు(అగ్రిమెంట్ ఆఫ్ సేల్, మనీ రిసీప్ట్) ఉండాలి. ఒక తెల్ల కాగితంపై యజమాని సంతకం తీసుకుని, దానిని అమ్మకం ఒప్పందంగా, డబ్బు అందుకున్న రసీదుగా చూపిస్తే తప్ప, కేవలం అద్దె చెల్లింపు ద్వారా ఆస్తి యజమాని కాలేరు. అందువల్ల, 12 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం అద్దెకు నివసించడం వల్ల ఒక వ్యక్తి "శాశ్వత అద్దెదారు"గా మారతాడే తప్ప, ఆస్తికి పూర్తి యజమానిగా మారడు. యజమాని ఆస్తిని ఖాళీ చేయించాలంటే, చట్టపరమైన ప్రక్రియను పాటించాలి, కొన్నిసార్లు అద్దెదారుకు నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుంది.

## తెలుగు రాష్ట్రాలకు మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్.. మార్చి 11 నుంచి పరుగులు.. ఈ రూట్ ఫిక్స్..




తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు శుభవార్త. ఏపీ, తెలంగాణలో మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి రానుంది. మార్చి 11న ఈ రైలు ప్రారంభం కానుందని సమాచారం. ఇంకా అధికారికంగా ప్రకటన రానప్పటికీ.. దాదాపు ఆ రోజు నుంచి ప్రారంభం కానుందని తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల ప్రజలకు రైల్వేశాఖ శుభవార్త అందించింది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల గుండా పలు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లు సర్వీసులు అందిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రయాణికులకు మెరుగైన ప్రయాణం సౌకర్యం అందించేందుకు మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడపాలని రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ రైలు త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. తెలంగాణ, ఏపీ మీదుగా తమిళనాడుకు ఇది వెళ్తుంది. దీని వల్ల సరమైన రైలు కనెక్టివిటీ ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ రైలు గురించి మరిన్ని వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

### ఈ స్టేషన్ల మధ్య ప్రయాణం

త్వరలో తెలుగు రాష్ట్రాలకు కొత్త అమృత్ భారత్ రైలు రానుంది. నాగర్ కోయిల్-చర్లపల్లి మధ్య ఈ రైలును ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ రైల్లో సూపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయి. దూర ప్రయాణికులకు సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ట్రైన్ ప్రవేశపెడుతున్నారు. మూడు రాష్ట్రాలను ఈ రైలు కలుపుతుంది. దీంతో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కేరళ ప్రజలకు మెరుగైన రైల్వే కనెక్టివిటీ లభించనుంది. త్వరలోనే ఈ రైలు ప్రారంభం కానుండగా.. షెడ్యూల్, స్టాప్ వివరాలు ప్రారంభం తేదీకి ముందు ప్రకటించనున్నారు. తమిళనాడు, ఏపీ, తెలంగాణ మధ్య ప్రయాణించేవారికి సులభతర ప్రయాణాన్ని అందిస్తుందని రైల్వేశాఖ స్పష్టం చేసింది. ఇక చర్లపల్లి నుంచి రైలు కనెక్టివిటీని పంచనుంది.

### మార్చి 11న ప్రారంభం

మార్చి 11న ఈ రైలును ప్రారంభించనున్నారని తెలుస్తోంది. చర్లపల్లి నుంచి బయల్దేరే ఈ రైలు... నల్లగొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట మీదుగా తమిళనాడులోకి ప్రవేశిస్తుంది. కాట్పాడి, జోలార్ పేట్, సేలం, ఈ రోడ్, కోయంబత్తూర్, పాలక్కాడ్, ఎర్నాకుకలం, కొట్టాయం, కొల్లాం మీదుగా తమిళనాడుకు చేరుకుంటుంది. 1500 కిలోమీటర్ల మేర ప్రయాణించే ఈ రైలు.. 30 గంటల్లో గమ్యస్థానానికి చేరుకుంటుంది. ఇక ఈ రైలులో బయో టాయిలెట్లు, సీసీటీవీ కెమెరాలు, ఛార్జింగ్ పాయింట్లు వంటి సౌకర్యాలు ఉంటాయి. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇది మంచి అవకాశంగా చెప్పవచ్చు. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి ముజఫర్‌పూర్, తిరువనంతపురం మధ్య అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తున్నాయి. ఇది కూడా అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి మూడు రైళ్లు వెళ్లినట్లు అవుతుంది. సామాన్యుల కోసం ఈ రైళ్లను తీసుకొస్తున్నారు.

## దేవుడా.. బంగారం అంత పెరుగుతుందా.. నోస్ట్రాడమస్ జోస్యంతో ప్రపంచం షాక్..



ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తోంది. ఇలాంటి అనిశ్చిత సమయాల్లో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం, వెండి ధరలు ఊహించని విధంగా తగ్గుముఖం పట్టాయి. అటు నోస్ట్రాడమస్ ప్రవచనాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటే, ఇటు మార్కెట్ నిపుణులు మాత్రం భిన్నమైన విశ్లేషణలు చేస్తున్నారు.అసలు బంగారం ధరలు మళ్లీ ఎప్పుడు పుంజుకుంటాయి..? పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తుంది. ఇజ్రాయెల్, ఇరాన్, లెబనాన్ మధ్య దాడులు తీవ్రతరమవ్వడం, హోర్ముజ్ జలసంధి మూసివేత వంటి పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఒత్తిడిలోకి నెట్టాయి. సాధారణంగా యుద్ధం ఉంటే బంగారం ధరలు పెరుగుతాయి. కానీ ప్రస్తుతం మార్కెట్లో సీన్ రివర్స్ అవుతోంది. బంగారం, వెండి ధరలు తగ్గుతున్నాయి. ఈ క్రమంలోనే ఫ్రెంచ్ జ్యోతిష్కుడు నోస్ట్రాడమస్ అంచనాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నోస్ట్రాడమస్ తన ప్రవచనాల్లో ఏడు నెలల యుద్ధం, రాత్రిపూట దాడుల గురించి ప్రస్తావించారు. వీటిని విశ్లేషకులు ఆధునిక డ్రోన్ దాడులకు, ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధానికి సంకేతంగా భావిస్తున్నారు. యుద్ధం కారణంగా బంగారం ధరలు విపరీతంగా పెరుగుతాయని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. 2026 నాటికి తులం బంగారం ధర రూ.4.5 లక్షలకు చేరుకోవచ్చని ఆయన అంచనా వేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇవి కేవలం ఊహాజనిత ప్రవచనాలు మాత్రమేనని, వీటికి మార్కెట్ నిర్ధారణ లేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.


### మార్కెట్లో ప్రస్తుత పరిస్థితి

యుద్ధం ఉన్నప్పటికీ, సురక్షితమైన ఆస్తులుగా భావించే బంగారం, వెండి ధరలు ప్రస్తుతం కొత్త లాభాలను అందుకోలేక ఇబ్బంది పడుతున్నాయి. వీజశ మార్కెట్లో బంగారం ధర దాదాపు 1శాతం తగ్గి రూ.1,59,400 కనిష్ట స్థాయికి చేరింది. ఏప్రిల్ 2026 నాటి రికార్డు గరిష్టం నుండి చూస్తే దాదాపు 18శాతం తగ్గింది. కిలో వెండి ధర రూ.2.60 లక్షల వద్ద ట్రేడవుతోంది. ఇది 2026 ఆరంభంలో ఉన్న గరిష్ట స్థాయి నుండి 41శాతం పడిపోవడం గమనార్హం. స్పాట్ గోల్డ్ ఔన్సుకు 5,100 డాలర్ల కంటే తక్కువకు, వెండి 84 డాలర్ల కంటే తక్కువకు పడిపోయాయి. అమెరికా డాలర్ బలోపేతం కావడమే దీనికి ప్రధాన కారణం.

### ధరలు ఎందుకు తగ్గుతున్నాయి?

యుద్ధ సమయంలో బంగారం పెరగాలి, కానీ అమెరికాలో ద్రవ్యోల్బణ భయాల వల్ల ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచుతుందనే అంచనాలు ఉన్నాయి. దీనివల్ల డాలర్ విలువ పెరిగి, పెట్టుబడిదారులు బంగారం వైపు కాకుండా డాలర్ వైపు మొగ్గు చూపుతున్నారు. రిద్ధిసిద్ధి బులియన్స్, ఎన్రిచ్ మనీ నిపుణుల ప్రకారం.. దీర్ఘకాలంలో బంగారం, వెండి ఇప్పటికీ బలంగానే ఉన్నాయి. బంగారం 5,000 డాలర్ల వద్ద బలమైన సపోర్ట్ ఉంది. ఒకవేళ 5,400 -- 5,600 డాలర్ల స్థాయిని దాటితే మళ్లీ కొత్త రికార్డులను సృష్టించవచ్చు. ఇక వెండి వెండి 90-95 డాలర్ల పైన స్థిరంగా కొనసాగితే, మళ్లీ 110 డాలర్ల మార్కును తాకే అవకాశం ఉంది. యుద్ధ వాతావరణం, భౌగోళిక అనిశ్చితి ఉన్న నేపథ్యంలో, ప్రస్తుత తగ్గుదల కేవలం తాత్కాలికమేనని దీర్ఘకాలికంగా బంగారం తన

## మార్చి 31 డెడ్ లైన్.. ఆలోపు ఈ పని చేయకపోతే జరిమానా కట్టాల్సిందే..




కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీపీఎఫ్, ఎన్‌పీఎస్ వంటి వాటిల్లో పెట్టుబడులు పెడుతున్నారా.. అయితే మార్చి 31లోపు మీరు ఖచ్చితంగా ఈ పని చేయాల్సిందే. లేకపోతే అకౌంట్ ఇనాక్టివ్ అవ్వడంతో పాటు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అందుకే ఈ విషయాన్ని ముందే గమనించాలి. మీరు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సుకన్య సమృద్ధి యోజన, నేషనల్ పెన్షన్ సిస్టమ్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల్లో పెట్టుబడులు పెడుతున్నారా..? అయితే మీకు బిగ్ అలర్ట్. మార్చి 31వ తేదీలోపు మీరు మినిమం డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. లేకపోతే మీ అకౌంట్ ఆటోమేటిక్‌గా ఇనాక్టివ్ అవుతుంది. దీంతో మార్చి 31లోపు తప్పకుండా చెల్లించండి. ఆ తర్వాత మీరు భారీగా జరిమానాలతో పాటు అకౌంట్ కూడా ఇనాక్టివ్ అవుతుంది. ఏయే స్కీమ్‌లో మినిమం డిపాజిట్ ఎంతవరకు చెల్లించాలి..? అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

### పీపీఎఫ్ స్కీమ్

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో ఎవరైనా పెట్టుబడి పెట్టవచ్చు. 18 సంవత్సరాల వయస్సు ఉన్నవారు ఎవరైనా ఇన్వెస్ట్ చేయవచ్చు. బ్యాంకులు లేదా పోస్టాఫీసుల ద్వారా అకౌంట్ సులువుగా ఓపెన్ చేయవచ్చు. సంవత్సరానికి మినిమం రూ.500 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. లేకపోతే అకౌంట్‌ను ఇనాపరేటివ్‌గా పరిగణిస్తారు. అకౌంట్ ఆగిపోతే లోన్, విత్‌డ్రా సౌకర్యాలు ఆగిపోతాయి. ఒక్కసారి ఇనాక్టివ్ అయితే మళ్లీ యాక్టివ్ చేసుకునేందుకు ఏడాదికి రూ.50 పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుంది.

### సుకన్య సమృద్ధి యోజన

ఇక ఈ పెట్టుబడి అకౌంట్ ఉన్నవారు ప్రతీ ఆర్థిక సంవత్సరంలో రూ.250 తప్పనిసరిగా జమ చేయాలి. లేకపోతే రూ.50 జరిమానా పడుతుంది. అంటే రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాత అకౌంట్ మళ్లీ యాక్టివ్ అవుతుంది. అకౌంట్ ఇనాక్టివ్ అవ్వకుండా ఉండాలంటే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి 31లోపు మినిమం అమౌంట్ జమ చేయండి

### నేషనల్ పెన్షన్ సిస్టమ్

ఇక నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో కనీసం ప్రతీ ఆర్థిక సంవత్సరంలో మినిమం డిపాజిట్ రూ. వెయ్యి జమ చేయాల్సి ఉంటుంది. మార్చి 31లోపు చేయకపోతే ఆ తర్వాత ఖాతా ఇనాక్టివ్ అవుతుంది. ఆ తర్వాత మళ్లీ యాక్టివేట్ చేసుకోవాలంటే రూ.100 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఇక మినిమం డిపాజిట్ వేయకపోతే ట్యాక్స్ బెనిఫిట్స్ కూడా నిలిచిపోతాయి. ఇక కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఇతర బీమా పథకాలకు కూడా ఇవే రూల్స్ వర్తిస్తాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాల్లో లక్షల మంది ఖాతాదారులుగా ఉన్నారు. వీటి ద్వారా లక్షల మందికి ఆర్థిక, ఆరోగ్య భద్రత లభిస్తోంది. కేంద్ర ప్రభుత్వ పథకాలు కావడంతో భద్రత ఉంటుందనే కారణంతో చాలామంది ఇన్వెస్ట్ చేస్తున్నారు. తక్కువ

## బంగారం ధరలు మరింత చౌక.. త్వరలో మరోసారి భారీ పతనం..! కారణం ఏంటంటే..?

బంగారం ధరలు గత వారం రోజులుగా కుప్పకూలుతూనే ఉన్నాయి. రోజురోజుకి పడిపోతూ కొనుగోలుచేసేవారికి ఊరట కల్గిస్తున్నాయి. అయితే గోల్డ్ రేట్లు రానున్న రోజుల్లో మరింత తగ్గిపోతాయనే వార్తలు వస్తున్నాయి. దీనికి పలు కారణాలు బలంగా వినిపిస్తున్నాయి. ఆ వివరాలు ఏంటో ఇప్పుడు చూద్దాం. బంగారం, వెండి ధరలు గత కొద్ది రోజులుగా భారీగా పడిపోతూ వస్తోన్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధం, పశ్చిమాసియాలో దారుణ పరిస్థితుల క్రమంలో కూడా ఊహించని విధంగా పసిడి ధరలు తగ్గడం చాలామంది పెట్టుబడిదారులను ఆయోమయంలో పడేస్తోంది. సాధారణంగా యుద్ధ పరిస్థితుల క్రమంలో ధరలు పెరుగుతాయి. కానీ ఈ సారి సీన్ రివర్స్ అవ్వడం హాట్ టాపిక్‌గా మారింది. యుద్ధ సమయాల్లో పెట్టుబడిదారులు సురక్షితమైన ఆస్తుల్లోకి తన డబ్బులను తరలిస్తారు. దీని వల్ల పసిడి ధరలు పెరుగుతూనే ఉంటాయి. ఈ సారి చమురు ధరలు పెరగడం, యుద్ధ ప్రభావం క్రమంలో కొంతమంది పెట్టుబడిదారులు బంగారం, వెండిని విక్రయించడానికి ప్రేరేపించాయి.

### లాభాల బుకింగ్

బంగారం ధరలు తగ్గడానికి లాభాల బుకింగ్ ఒక కారణంగా తెలుస్తోంది. ఇటీవల సంక్షోభం క్రమంలో బంగారం పెరగడం వల్ల చాలమంది పెట్టుబడిదారులు లాభాలు పొందారు. ఆ తర్వాత ముడి చమురు ధరలు పెరగడంపై స్టాక్ మార్కెట్లపై ఒత్తిడి పెరిగింది. దీంతో కొంతమంది ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్లో కొంత భాగాన్ని విక్రయించి ఇతర చోట్ల నష్టాలను భర్తీ చేశారు. బంగారం ధరల తగ్గుదలకు ఇదొక కారణంగా చెప్పవచ్చు.

### డాలర్ బలపడటం

ఇక డాలర్ బలపడటం కూడా గోల్డ్ రేట్లు కుప్పకూలడానికి ఒక కారణంగా చెప్పవచ్చు. డాలర్ పెరిగినప్పుడు ఇతర కరెన్సీలను ఉపయోగించే కొనుగోలుదారులకు పసిడి మరింత ఖరీదు అవుతుంది. ఇక యూఎస్ ట్రెజరీ రాబడి పెరగడం వల్ల బంగారం వంటి రాబడి లేని ఆస్తుల ఆకర్షణను తగ్గిస్తుంది. ఇక ద్రవ్యోల్బణం పెరుగుతున్న క్రమంలో ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లలో కొతను ఆలస్య చేస్తోందనే అంచనాలు మరింత ఒత్తిడిని పెంచుతున్నాయి. దీంతో పసిడి ధరలపై దీని ప్రభావం పడుతుంది.


సెంట్రల్ బ్యాంకుల సెంటిమెంట్

ఇక ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంకులు తమ బంగారు నిల్వల్లో కొంత భాగాన్ని విక్రయించే అవకాశముందనే వార్తలు



వినిపిస్తున్నాయి. ఇది పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. మార్కెట్లలో ఒత్తిడి నెలకొన్నప్పుడు లిక్విడిటీని పెంచుకోవడానికి సెంట్రల్ బ్యాంకులు తమ గోల్డ్ నిల్వల్లో కొంత భాగాన్ని విక్రయించుకుంటూ ఉంటాయి. ఇది జరిగితే మార్కెట్ సరఫరా పెరుగుతోంది. డిమాండ్ బలంగా ఉన్నప్పటికీ ధరలపై ఒత్తిడి తెచ్చే అవకాముంది.

# యువతలో 83 మంది కంటెంట్ క్రియేటర్లే..! ఆ నివేదికలో వెల్లడి



పొద్దున్న వాకింగ్ చేస్తుంటాం.. ఒక దృశ్యం మనల్ని ఆకట్టుకుంటుంది. ఒక సంఘటన మనల్ని కలచి వేస్తుంది. ఎలాగూ స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉంటుంది కాబట్టి చూసింది చూసినట్టు వీడియో తీసి ఇన్‌స్టాలోనో, యూట్యూబ్‌లోనో, ఫేస్‌బుక్ లోనో పోస్ట్ చేసేస్తుంటాం. ఏం జరిగిందో పూసగుచ్చినట్టు వివరిస్తుంటాం. బస్సులోనో, ట్రైన్‌లోనో జర్నీ చేస్తుంటాం.. హాయ్ అంటూ మొదలయ్యే కొన్ని పలకరింపులు పరిచయాలుగా మారుతుంటాయ్.. ఆ అనుభవాలను అక్షరాలుగా అల్లితే అందమైన కథగానో, పొడిగిస్తూ పోతే నవలగానో మారుతుంది. ఈ విధమైన అనుభవాలే భారత దేశంలో అనేకమందిని కంటెంట్ రైటర్లుగా, క్రియేటర్లుగా మార్చేస్తున్నాయి. యూట్యూబ్ ఇండియా అండ్ స్మిత్ జీగం సంయుక్తంగా విడుదల చేసిన తాజా రిపోర్ట్ కూడా అదే వెల్లడించింది. జెన్ జీలలో 83 మంది తమను తాము ప్రొఫెషనల్ కంటెంట్ క్రియేటర్లుగా మల్చుకుంటున్నారని పేర్కొన్నది. కంటెంట్ పట్ల పెరుగుతున్న ఆసక్తి, మారుతున్న ఆలోచన ఈతరం యువతను ప్రొఫెషనల్ క్రియేటర్లుగా తీర్చి దిద్దడమే కాకుండా, ఇది డిజిటల్ ఎకానమీని 'క్రియేటర్-లెడ్'గా మార్చేస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. దీనిని బట్టి ఆధునిక యువత తమ క్రియేటివ్ ఆలోచనలను కంటెంట్ క్రియేటర్‌గా మల్చుకోవడంలో ఎలాంటి ప్రతిభను కనబరుస్తున్నదో అర్థం చేసుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు. తాజా నివేదిక ప్రకారం.. గత సంవత్సరం 91 జెన్ జీలు ఫ్యాన్స్ ఫ్యాన్‌డమ్ యాక్టివిటీస్‌లో పాల్గొనగా, ఇందులో 93 % మంది ఇతర సోషల్ మీడియా వేదికలు కలిగి ఉన్నప్పటికీ, తమ ఆసక్తులు, అభిరుచులు పంచుకోవడానికి, కంటెంట్ క్రియేటింగ్, ప్రజెంటేషన్ కోసం యూట్యూబ్‌ను ప్రధాన వేదికగా ఉపయోగించుకున్నారు. కొత్తగా కంటెంట్ క్రియేటర్లు మారుతున్న వారిలోనూ 62 మంది తమ స్నేహితుల లేదా నచ్చిన క్రియేటర్ల ఫ్యాన్‌డమ్‌లతో ప్రేరణ పొందుతూ తమను తాము ప్రొఫెషనల్ క్రియేటర్లుగా మల్చుకుంటున్నారు. ఇది బలమైన 'నిచ్ డిజిటల్ కమ్యూనిటీల ఆవిరావేనికి దారితీస్తోందని, యూజర్ల ఆసక్తికి అనుగుణంగా యూట్యూబ్ క్రియేట్స్, షార్ట్స్, సూపర్ చాట్స్, మెంబర్‌షిప్స్, మర్చ్ ఇంటిగ్రేషన్స్ వంటి టూల్స్ ద్వారా క్రియేటర్ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేస్తున్నామని యూట్యూబ్ ఇండియా డైరెక్టర్ ఇషాన్ జాన్ చటర్జీ పేర్కొన్నారు.

## యూరిన్ రంగు మారుతోందా..?

# కిడ్నీలు డేంజర్లో ఉన్నట్టే !




శరీరంలోని అవయవాలన్నీ సక్రమంగా పనిచేసినప్పుడే మనం ఆరోగ్యంగా ఉండగలుగుతాం. అలాంటి వాటిలో కిడ్నీలు ఒకటి. ముఖ్యంగా రక్తాన్ని వడబోసి అందులోని విషపూరిత వ్యర్థాలను బయటకు పంపడంలో ఇవి కీ రోల్ పోషిస్తాయి. వీటి పనితీరు మందగిస్తే కిడ్నీల వైఫల్యానికి దారితీసి ప్రాణాంతకం కావచ్చు. కాబట్టి మూత్ర పిండాలు సరిగ్గా పనిచేయడం లేదనే సంకేతాలు లేదా లక్షణాలు కనిపిస్తే అలర్ట్ అవ్వాలంటున్నారు నిపుణులు. అయితే ఆ లక్షణాలేమిటో ఇప్పుడు తెలుసుకుందాం. యూరిన్ తక్కువగా రావడం : మూత్ర విసర్జన సమయంలో మంటగా అనిపించడం, తరచుగా మరీ తక్కువగా రావడం వంటి సమస్యలను కొందరు పెద్దగా పట్టించుకోరు. అదేదో చిన్న సమస్య అనుకుంటారు. కానీ ఇది తరచుగా రిపీట్ అవుతుంటే మాత్రం జాగ్రత్త పడాల్సిందే. ఎందుకంటే కిడ్నీలు పనితీరు సరిగ్గా లేకపోయినప్పుడు కూడా మూత్రం తక్కువగా రావడం, మంటగా అనిపించడం వంటి లక్షణాలు సంభవిస్తాయి. వీటిని గుర్తిస్తే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలి. రంగు మారడం: సాధారణంగా యూరిన్ తెల్లగా, లేదా కాస్త ఎల్లో కలర్‌గా వస్తూ ఉంటుంది. అయితే ఇది గోధుమ రంగులో వస్తుంటే మాత్రం అనుమానించాల్సిందే అంటున్నారు వైద్య నిపుణులు. కిడ్నీల పనితీరు మందగించినప్పుడు, ఇంటర్నల్ బ్లీడింగ్ వల్ల కూడా ఈ ప్రాబ్లమ్స్ వస్తుంటాయి. నిర్లక్ష్యం చేస్తే కిడ్నీలు డ్యామేజ్ అయ్యే చాన్స్ ఉంటుంది. కాబట్టి లక్షణాలు గుర్తించగానే జాగ్రత్త పడాలని నిపుణులు సూచిస్తున్నారు. పొడి చర్మం : వైద్య నిపుణుల ప్రకారం.. చర్మం పొడిగా మారడానికి అనేక కారణాలు ఉండవచ్చు. అయితే ఎక్కువ పొడిగా ఉండి, తరచుగా దురద వస్తుంటే మాత్రం అది కిడ్నీ డిసీజెస్‌కు సంకేతం కూడా కావచ్చు. దీంతోపాటు మూత్రంలో రక్తం పడటం, మంటగా అనిపించడం, తరచుగా రెడ్, పింక్ బబుల్స్ రావడం కూడా కిడ్నీ వ్యాధులకు సంకేతం అటున్నారు నిపుణులు.వాపు : చేతివేళ్లు, మోకాళ్లు, పిక్కలు, ముఖం వంటి భాగాల్లో కొందరికి వాపు వస్తూ ఉంటుంది. ఎప్పుడో ఒకసారి అంటే ఇది సాధారణ సమస్య అనుకోవచ్చు. కానీ తరచుగా అదే కంటిన్యూ అవుతుంటే మాత్రం కిడ్నీ ప్రాబ్లమ్స్ వల్ల కావచ్చు అంటున్నారు నిపుణులు. అట్లనే దీరకాలంపాటు నిద్రలేమి, రాత్రిళ్లు మధ్య మధ్యలో తరచుగా యూరిన్‌కు వెళ్లాల్సి రావడం, వెళ్లినప్పుడల్లా మంటగా అనిపించడం వంటివి జరుగుతుంటే కూడా కిడ్నీల పనితీరు బాగా లేదని అనుమానించి వైద్య నిపుణులను సంప్రదించాలి. గమనిక : పైవార్తలోని సమాచారం ఇంటర్నెట్ ఆధారంగా సేకరించబడింది. 'దిశ' ధ ృవీకరించలేదు. మీ అవగాహన కోసం మాత్రమే అందిస్తున్నాం. అనుమానాలు ఉంటే వైద్య నిపుణులను సంప్రదించగలరు.

# ఉదయాన్నే పచ్చి వెల్లుల్లి తింటున్నారా?

### రోజూ తింటే షుగర్, బీపీ తగ్గుతుందా? – చెడు కొలెస్ట్రాల్ నూ తగ్గిస్తుందా?

ఆరోగ్యంగా ఉండటానికి సులువైన చిట్కాలు పాటించే వారు, ఉదయాన్నే పచ్చి వెల్లుల్లి తినడానికి ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. వెల్లుల్లిలో అల్లిసిన్ వంటి సహజసిద్ధమైన సమ్మేళనాలతో పాటు యాంటీఆక్సిడెంట్, యాంటీమైక్రోబయల్ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. వీటిని సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకున్నప్పుడు శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా వంటలలో రుచిని పెంచడానికి వెల్లుల్లిని ఉపయోగిస్తున్నప్పటికీ, దీనిని కొద్ది పరిమాణంలో పచ్చిగా తినడం వల్ల మరికొన్ని అదనపు ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, పచ్చి వెల్లుల్లి అనేది వైద్య చికిత్సకు లేదా ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రత్యామ్నాయం కాదని, కేవలం అనుబంధంగా మాత్రమే పనిచేస్తుందని గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు. రోగనిరోధక శక్తిని పెంపొందించవచ్చు : వెల్లుల్లిలో సల్ఫర్ సమ్మేళనాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరం సహజ రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంలో సహాయపడతాయి. అయితే, కేవలం వెల్లుల్లి మాత్రమే కాకుండా, పోషకాలు ఉన్న ఆహారం, తగినంత నిద్ర, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, రోజువారి ఆహారంలో తగిన పరిమాణంలో వెల్లుల్లిని కూడా చేర్చుకోవడం వల్ల రోగనిరోధక వ్యవస్థ మెరుగవుతుందని నిపుణులు చెబుతున్నారు. గుండె ఆరోగ్యానికి తోడ్పడవచ్చు : వెల్లుల్లి వల్ల కలిగే ప్రయోజనాలలో గుండె ఆరోగ్యానికి తోడ్పడటం అనేది అత్యధికంగా చర్చించే అంశం. పచ్చి వెల్లుల్లిని తరిగినప్పుడు లేదా నలిపినప్పుడు అందులో నుంచి 'అల్లిసిన్' అనే శక్తివంతమైన సమ్మేళనం విడుదలవుతుంది. ఈ క్రమంలో రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిల వంటి గుండె జబ్బుల ప్రమాద కారకాలను తగ్గించడంలో వెల్లుల్లి స్వల్ప సానుకూల ప్రభావాన్ని చూపుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. అందువల్ల, సమతులాహారంలో భాగంగా క్రమం తప్పకుండా వెల్లుల్లిని చేర్చుకోవడం అనేది గుండెను ఆరోగ్యంగా ఉంచుకునే మంచి అలవాట్లలో ఒకటిగా చెప్పుకోవచ్చు. జీర్ణక్రియకు తోడ్పడవచ్చు : ఉదయాన్నే పరగడుపున పచ్చి వెల్లుల్లిని తినడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుందని చాలా మంది నమ్ముతారు. వెల్లుల్లిలో ఉండే కొన్ని ప్రత్యేక సమ్మేళనాలు జీర్ణవ్యవస్థపై సానుకూల ప్రభావం చూపడమే కాకుండా, జీర్ణకోశంలోని మంచి బ్యాక్టీరియా పనితీరును కూడా ప్రభావితం చేయగలవు. అయితే, పచ్చి వెల్లుల్లి చాలా ఘాటుగా ఉంటుంది. దీనివల్ల కొంతమందిలో గుండెల్లో మంట, కడుపులో అసిడిటీ, ఉబ్బరం లేదా అసౌకర్యం వంటి సమస్యలు తలెత్తవచ్చు. ముఖ్యంగా సున్నితమైన కడుపు ఉన్నవారు ఉదయాన్నే పరగడుపున తినడం కంటే, ఏదైనా ఆహారంతో కలిపి వెల్లుల్లిని తీసుకోవడం వల్ల పొట్టకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సులభంగా జీర్ణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. యాంటీ ఆక్సిడెంట్ సమ్మేళనాలను అందిస్తుంది : పచ్చి వెల్లుల్లిలో ఆక్సీకరణ ఒత్తిడి నుంచి కణాలను రక్షించడంలో సహాయపడే యాంటీ ఆక్సిడెంట్ సమ్మేళనాలు పుష్కలంగా ఉంటాయి. శరీరంలో జరిగే సాధారణ జీవక్రియ ప్రక్రియల సమయంలో సహజంగానే ఫ్రీ రాడికల్స్ ఉత్పత్తి అవుతాయి. కాబట్టి, వాటిని అరికట్టడానికి యాంటీ ఆక్సిడెంట్లు చాలా అవసరం. అందువల్ల, రోజువారీ భోజనంలో వెల్లుల్లిని చేర్చుకోవడం ద్వారా శరీరానికి మంచిదంటున్నారు నిపుణులు. అయితే, వెల్లుల్లి ద్వారా లభించే ఈ యాంటీఆక్సిడెంట్ ప్రయోజనాలను కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు, గింజలు వంటి పోషకాలు అధికంగా ఉండే సమతుల్య ఆహారంలో ఒక భాగంగా మాత్రమే భావించడం ఉత్తమం. బరువు నియంత్రణ : వెల్లుల్లిని కొన్నిసార్లు సహజంగా కొవ్వును కరిగించే ఆహారంగా ప్రచారం చేస్తుంటారు.

# ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్.. ఎందుకు వస్తుంది..? ఏం చేయాలి?



పొట్ట నొప్పి, కడుపులో ఉబ్బరం, గందరగోళంగా అనిపించడం, తిమ్మిరి, అలసట, శక్తిహీనంగా అనిపించడం, మలంలో రక్తం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు తరచుగా కనిపిస్తే అనుమానించాల్సిందే. అంటున్నారు వైద్య నిపుణులు. ఎందుకంటే ఇవి ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ సంకేలు కావచ్చు. కొన్నిసార్లు జ్వరం కూడా వస్తూ ఉంటుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన అధ్యయనాల్లో ప్రతీ లక్ష మందిలో సుమారు 50--100 మందికి ఇది ఉన్నట్లు గుర్తించారు. నిజానికిది పేగులు అండ్ జీరా?శయంలో దీరకాలిక వాపు (ఇన్‌ఫ్లమేషన్) కలిగించే వ్యాధుల సమూహం. క్రోన్స్ డిసీజ్, అలాగే అల్సరేటివ్ కోలైటిస్ అనే రెండు ప్రధాన రకాలుగా ఉంటుంది. కంటెంట్ క్రియేటర్లే..! ఆ నివేదికలో వెల్లడి ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ ఒకప్పుడు పాశ్చాత్య దేశాల్లోనే ఎక్కువగా కనిపించేది.. కానీ ఇటీవలి దశాబ్దాల్లో భారతదేశంలో కూడా ఈ వ్యాధి వేగంగా పెరుగుతోంది. ఇండియన్ సొసైటీ ఆఫ్ గాస్ట్రోఎంటరాలజీ నివేదిక ప్రకారం.. దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలలో ఈ వ్యాధి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ కేసులు అధికంగా ఉండటానికి జీవనశైలిలో మార్పులు, ప్రాసెస్ చేసిన ఆహారాలు తీసుకోవడం, ఒత్తిడి ప్రధాన కరణమని చెప్పవచ్చు.

## ఎందుకు వస్తుంది?

ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ అనేది జన్యుపరమైన కారణాలు, రోగనిరోధక వ్యవస్థలో లోపాలు, పర్యావరణ కారకాలు, అలాగే పేగులోని బ్యాక్టీరియా వీ అసాధారణ ప్రతిస్పందనల కలయిక వల్ల వస్తుంది. రోగనిరోధక వ్యవస్థ పొరపాటున ఆరోగ్యకరమైన ప్రేగు కణాలపై దాడి చేయడం వల్ల దీరకాలిక వాపు ఏర్పడుతుంది. అంటే రోగనిరోధక వ్యవస్థ ప్రేగులలోని సాధారణ బ్యాక్టీరియాను హానికరమైనవిగా భావించి, వాటిని నిర్మూలించే క్రమంలో సొంత ప్రేగు కణజాలాన్ని దెబ్బతీస్తుంది. కుటుంబంలో ఎవరికైనా ఈ వ్యాధి ఉంటే కూడా వారసులకు వచ్చే అవకాశం.

## లక్షణాలుజి

ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ లక్షణాల విషయానికి వస్తే.. వ్యక్తి నుంచి వ్యక్తికి భిన్నంగా ఉండవచ్చు. తరచుగా డయేరియా వేధిస్తుంది. చాలా సందరాల్లో ఇది రక్తస్రావంతో కూడి ఉంటుంది. అలాగే పొట్ట నొప్పి, బరువు తగ్గడం, అలట, శక్తిహీనత, కొన్ని కొన్నిసార్లు జ్వరం, పిల్లల్లో అయితే శారీరక పెరుగుదలలో ఆలస్యం వంటివి కనిపిస్తాయి. హిళల్లో ఇర్రెగ్యులర్ పీరియడ్స్ వంటివి ఉండవచ్చు.

## నిర్ధారణజి

ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్‌ను కచ్చితంగా నిర్ధారించేందుకు వివిధ మెడికల్ టెస్టులు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా వాపు, రక్తహీనత గుర్తించేందుకు రక్తపరీక్షలు అవసరం. బ్యాక్టీరియల్ ఇనెక్షన్లు ఖరారు చేయడానికి, కాల్ ప్రొటెక్టివ్ వంటి మార్కర్లను చూడటానికి స్టూల్ టెస్ట్ ఉంటుంది. పేగుల అంతరాన్నీ నేరుగా పరిశీలించేందుకు కొలొనోస్కోపీ అవసరం. పేగుల నుంచి శాంపిల్స్ తీసి పరిశీలించడానికి బయోప్సీ టెస్ట్ అవసరం. అలాగే అవసరాన్ని బట్టి సిటి స్కాన్ లేదా ఎంఆర్ఐ టెస్టులను కూడా రిఫర్ చేస్తారు.

## నివారణ-చికిత్స

దీనికి జన్యుపరమైన కారణాలు ఉంటాయి కాబట్టి ఐబీడీని పూర్తిగా నివారించలేం. కానీ రిస్క్ తగ్గించడానికి సిగరెట్ స్మోకింగ్ మానేయడం, మందులు (ఇబుప్రోఫెన్ వంటివి) అవాయిడ్ చేయడం చాలా ముఖ్యం. అలాగే ఒత్తిడి నిర్వహణ కోసం మెడిటేషన్, ఎక్సర్‌సైజ్, థెరపీ వంటివి చేయాలి. పెద్ద మొత్తంలో ఒకేసారి కాకుండా తక్కువ తక్కువ ఎక్కువసార్లు హెల్తీ మీల్స్ తినడం, ఆల్కహాల్, కెఫిన్, డైరీ, గ్రీజీ ఫుడ్స్ అవాయిడ్ చేయడం, వ్యాక్సినేషన్స్ తీసుకోవడం నివారణంలో భాగమని చెప్పవచ్చు. నివారణ ద్వారా తగ్గకపోతే వైద్య నిపుణులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి.

## లిగమనిక :

పైవార్తలోని సమాచారం ఇంటర్నెట్ ఆధారంగా సేకరించబడింది. 'దిశ' ధ ృవీకరించలేదు. అనుమానాలు ఉంటే వైద్య నిపుణులను సంప్రదించగలరు.

# మహిళా క్రికెటర్ల మ్యాచ్ ఫీజులు భారీగా పెంపు- అప్పుడెంత? ఇప్పుడెంత?

బలపడనున్న క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్న అమ్మాయిల ఆర్థిక భద్రత- ఫీజులను రెట్టింపుకన్నా ఎక్కువగా పెంచిన బీసీసీఐ

దేశవాళీ క్రికెట్‌లో మహిళా క్రికెటర్లకు బీసీసీఐ గుడ్ న్యూస్ చెప్పింది. మహిళా క్రికెటర్లు, మ్యాచ్ అధికారుల ఫీజులను రెట్టింపుకన్నా ఎక్కువగా పెంచింది. దీంతో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్న అమ్మాయిల ఆర్థిక భద్రత మరింత బలపడనుంది. ఇటీవల భారత్ తొలిసారిగా మహిళల వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకోవడం చారిత్రక ఘట్టంగా నిలిచిన నేపథ్యంలో కీలక నిర?యాన్ని బీసీసీఐ తీసుకుంది. ఈ పెంపుదలను బోర్డు అపెక్స్ కౌన్సిల్ అధికారికంగా ఆమోదం తెలిపింది.

## రెట్టింపుకు పైగా పెరుగుదల

సవరించిన చెల్లింపు విధానం ప్రకారం మహిళల దేశవాళీ టోర్నీల్లో పాల్గొనే ఆటగాళ్లకు భారీగా ఫీజులు పెరిగాయి. సీనియర్ మహిళల దేశవాళీ వన్డే టోర్నమెంట్‌తో పాటు బహుళ రోజుల టోర్నీల్లో తుది జట్టులో చోటు దక్కించుకున్న ప్లేయర్లకు రోజుకు రూ.50 వేల మ్యాచ్ ఫీజు చెల్లించనున్నారు. ఇప్పటివరకు ఈ ఫీజు కేవలం రూ.20 వేలు మాత్రమే ఉండేది. ఇక రిజర్వ్ ఆటగాళ్లకు రోజుకు రూ.25 వేలు అందించనున్నారు. అంటే గతంతో పోలిస్తే రెట్టింపుకు పైగా పెరుగుదల నమోదైంది. అలాగే జాతీయ స్థాయి మహిళల టీ20 టోర్నీల్లోనూ ఫీజులు గణనీయంగా పెరిగాయి. ఈ టోర్నీల్లో తుది జట్టులో ఉన్న ఆటగాళ్లకు రోజుకు రూ.25 వేలు చెల్లిస్తారు. రిజర్వ్‌లకు రోజుకు రూ.12,500 ఇవ్వనున్నారు. ఈ విధంగా అన్ని ఫార్మాట్లలో ఆడే అగ్రశ్రేణి మహిళా క్రికెటర్లు ఒక సీజన్‌లో రూ.12 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు సంపాదించే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఇది మహిళా క్రికెటర్లకు పెద్ద ఊరటగా మారనుంది.

## మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని!


యువ క్రికెటర్లను కూడా బీసీసీఐ మర్చిపోలేదు. అండర్-23, అండర్-19 విభాగాల్లో ఆడే మహిళా క్రికెటర్లకు కూడా మ్యాచ్ ఫీజులు పెంచింది. ఈ విభాగాల్లో తుది జట్టులో ఉన్న ఆటగాళ్లకు రోజుకు రూ.25 వేలు చెల్లించనున్నారు. రిజర్వ్ ఆటగాళ్లకు రోజుకు రూ.12,500 అందిస్తారు. చిన్న వయసులోనే క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకుంటున్న అమ్మాయిలకు ఇది మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు దేశవాళీ క్రికెట్‌లో కీలక పాత్ర పోషించే మ్యాచ్ అధికారుల ఆదాయాన్ని కూడా బీసీసీఐ పెంచింది. అంపైర్లు, రిఫరీలకు రోజుకు రూ.40 వేల మ్యాచ్ ఫీజు చెల్లించనున్నారు. ఇక నాకౌట్ మ్యాచ్‌లకు అయితే మ్యాచ్ ప్రాధాన్యతను బట్టి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఫీజు ఉంటుంది. దీని ప్రకారం ఒక అంపైర్ రంజీ ట్రోఫీ లీగ్ మ్యాచ్‌కు సుమారు రూ.1.60 లక్షలు సంపాదిస్తారు. అదే నాకౌట్ మ్యాచ్‌లకు అయితే రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆర్జించే అవకాశం ఉంటుంది.

## భవిష్యత్తుకు బలమైన పునాది

మొత్తంగా చూస్తే మహిళల క్రికెట్‌కు బీసీసీఐ పెద్ద పీట వేస్తున్నట్లు ఈ నిర?యం స్పష్టంగా చెబుతోంది. మ్యాచ్ ఫీజుల పెంపుతో మహిళా క్రికెటర్లకు ఆర్థిక భరోసా పెరగడమే కాకుండా, దేశవాళీ స్థాయిలో మరిన్ని యువతులు క్రికెట్ వైపు ఆకర్షితులయ్యే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు. మహిళల ప్రపంచకప్ విజయం తర్వాత తీసుకున్న ఈ నిర?యం, భారత మహిళల క్రికెట్ భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

మరోవైపు, ఇటీవల ముగిసిన అండర్-19 ఆసియా కప్‌లో ఆయుష్ మాత్రే నేత ృత్వంలోని భారత జట్టు వరుసగా అన్ని మ్యాచ్‌లు గెలిచి కీలకమైన టైటిల్ పోరులో తడబడింది. పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్‌లో భారత్ 191 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. ఈ విషయాన్ని బీసీసీఐ సీరియస్‌గా తీసుకుంది. ఇటీవల అండర్-19 జట్టు ప్రదర్శనపై సోమవారం ఆన్‌లైన్‌లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో బోర్డు సభ్యులు చర్చించారు. టీమ్ పెరామేన్స్‌పై సమీక్ష అవసరమని నిర?యించారు.

# రెయిన్‌బో హాస్పిటల్స్‌లో అరుదైన శస్త్రచికిత్స.. ల్యాప్రోస్కోపిపై డాక్టర్ మానస కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలోని బర్త్‌రైట్ బై రెయిన్‌బో హాస్పిటల్స్ వైద్యులు అరుదైన ఘనత సాధించారు. 26 ఏళ్ల యువతి గరాశయం నుండి సుమారు 2.7 కిలోల బరువున్న 11 పెద్ద ఫైబ్రాయిడ్లను అత్యాధునిక లాప్రోస్కోపిక్ పద్ధతిలో విజయవంతంగా తొలగించారు. యువతి భవిష్యత్తులో తల్లి అయ్యే అవకాశాన్ని కాపాడుతూ, గరాశయానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఈ శస్త్రచికిత్స నిర్వహించడం విశేషం. ఈ సందరరేగా డాక్టర్ మానస బద్వేలి మాట్లాడుతూ "ఇది చాలా క్లిష్టమైన కేసు. యువతి వయస్సు ద ృష్ట్యా ఆమె గరాశయాన్ని కాపాడటం మాకు అత్యంత ప్రాధాన్యత. ల్యాప్రోస్కోపిక్ పద్ధతి ద్వారా తక్కువ రక్తస్రావం, తక్కువ నొప్పి, వేగంగా కోలుకునే అవకాశం కలుగుతుంది. శస్త్రచికిత్స అనంతరం సదరు యువతి పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు" అని తెలిపారు.


## లాప్రోస్కోపీ తో అదుతేం:

బాధిత యువతి గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పి, అధిక రక్తస్రావంతో బాధపడుతోంది. పరీక్షించిన వైద్యులు ఆమె గరాశయంలో భారీ కణితులు ఉన్నట్లు గుర్తించారు. వీటి కారణంగా ఆమె గరాశయం ఎనిమిది నెలల గరిణీ పరిమాణానికి పెరిగింది. ఇందులో మూడు కణితులు కర్బూజ పండు అంత పెద్దవిగా ఉండగా, మిగిలినవి మోసంబి కాయ పరిమాణంలో ఉన్నాయి. సాధారణంగా ఇంత పెద్ద కణితులు ఉన్నప్పుడు ఇతర ఆసుపత్రులు ఓపెన్ సర్జరీ చేయాలని సూచిస్తాయి. అయితే, బర్త్‌రైట్ బై రెయిన్‌బో హాస్పిటల్స్‌లోని సీనియర్ గైనకాలజిస్ట్, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ మానస బద్వేలి నేత ృత్వంలోని బ ృందం సవాలును స్వీకరించి, కేవలం చిన్న రంధ్రాల ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేశారు. హై-రిజల్యూషన్ ఎంఆర్ఐ స్కాన్ ద్వారా కణితుల స్థానాన్ని కచ్చితంగా గుర్తించి, అత్యంత జాగ్రత్తగా వాటిని తొలగించారు.

## లాప్రోస్కోపి ప్రయోజనాలు:

కోత చిన్నదిగా ఉండటం వల్ల శస్త్రచికిత్స తర్వాత నొప్పి చాలా తక్కువగా ఉంటుంది. రోగులు చాలా త్వరగా తమ దైనందిన పనులకు తిరిగి వెళ్లవచ్చు. చర్మంపై పెద్ద గాయాలు ఉండవు, సౌందర్య పరంగా కూడా ఇది మేలైనది. రక్తస్రావం, ఇనెక్షన్ వచ్చే ప్రమాదం చాలా తక్కువ. మహిళల్లో గరాశయ ఫైబ్రాయిడ్ల పట్ల అవగాహన అవసరమని, సరైన సమయంలో గుర్తిస్తే అత్యాధునిక చికిత్సలతో గరాశయాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు సూచించారు.

# వింటర్‌లో మూడ్ స్వింగ్స్..! బయటపడాలంటే తీసుకోవాల్సిన ఆహారాలివే..



ఇతర సీజన్లతో పోలిస్తే వింటర్‌లో ఎక్కువమంది పొద్దున్నే మూడ్ స్వింగ్స్ ఎదుర్కొంటుంటారు. చల్లని వాతావరణం, వ్యాయామాలు తగ్గడం, ఉదయంపూట ఎండ తగలకపోవడం, శరీరంలో విటమిన్ డి లోపించడం వంటివి ఇందుకు కారణం అవుతుంటాయి. ఇక ఒంటరిగా ఉండేవారైతే మరింత ఎక్కువగా మానసిక ఇబ్బందులను ఎదుర్కొనే చాన్సె ఉంటాయి. దిగాలుగా అనిపించడం, చిన్న విషయానికే అతిగా ఊహించుకొని బాధపడటం వంటి ప్రతికూల మానసిక పరిస్థితులు కూడా వేధిస్తుంటాయి. అయితే కొన్ని రకాల ఆహారాలు తీసుకోవడం ద్వారా ఇలాంటి మూడ్ స్వింగ్స్ నుంచి బయటపడవచ్చు అంటున్నారు మానసిక ఆరోగ్య నిపుణులు. అవేమిటో చూద్దాం.

## డార్క్ చాక్లెట్ :

ఫ్లేవనాయిడ్స్, పాలీఫెనోల్స్ పుష్కలంగా ఉండే ఆహారాల్లో డార్క్ చాక్లెట్ ఒకటి. దీనిని తినడంవల్ల బాడీలో సెరటోనిన్ హార్మోన్ లెవల్ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా చలికాలంలో తినడంవల్ల ఒత్తిడి, ఆందోళన, ఒంటరితనం వంటి భావాల నుంచి బయటపడవచ్చు. నేరుగా తినడానికి ఇష్టపడని వారు ఓట్స్, కాఫీ, హెల్తీ డ్రింక్స్‌లోనూ దీనిని కలిపి తీసుకోవచ్చు. దీనివల్ల మనసు ఉల్లాసంగా, ఉత్సాహంగా మారుతుంది.

## నట్స్ అండ్ సీడ్స్ :

శరీరానికి మేలు చేసే పోషకాలకు మూలం కాబట్టి బాదం, జీడిపప్పు, వాల్ నట్స్, అట్లనే సన్ ఫ్లవర్ సీడ్స్, గుమ్మడి విత్తనాలు, ఇతర తినగలిగే కాయగూరల గింజలు ఆహారంలో భాగంగా తీసుకుంటే మూడ్ స్వింగ్స్ తగ్గుతాయి. హ్యాపీనెస్ ఏర్పడుతుంది. ఎందుకంటే ఇవన్నీ సెరోటోనిన్ హార్మోన్‌ను పెంచుతాయి. అలాగే వీటిలోని యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, మినరల్స్ ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

## అరటి పండ్లు, ఓట్స్ ఫ్యాటీఫిష్ :

ప్రతీ సీజన్‌లో అందుబాటులో ఉండే ముఖ్యమైన ఫలాల్లో అరటి పండ్లు ఒకటి. వీటిలో విటమిన్ బి6 అధికంగా ఉంటుంది. చలికాలంలో తరచుగా తినడంవల్ల ఫీల్ గుడ్ హార్మోన్లుగా పేర్కొనే డొపమైన్, అలాగే సెరటోనిన్ ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో మీరు సంతోషంగా ఉండగలుగుతారు. అలాగే ఓట్స్‌లో డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుంది. కాబట్టి వీటిని ఆహారంగా తీసుకుంటే నీరసం, బద్ధకం పోతాయి. మానసిక పరిస్థితి మెరుగు పడుతుంది. బ్యాడ్ మూడ్ స్వింగ్స్‌ను పోగొట్టే ముఖ్యమైన ఆహారాల్లో ఫ్యాటీ ఫిషెస్ కూడా ముఖ్యమైనవి. ముఖ్యంగా సాల్మోన్, టునా వంటి చేపల్లో ఒమేగా -3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఒత్తిడి, ఆందోళన భావాలను దూరం చేస్తాయి. స్ట్రా బెర్రీ, బ్లూ బెర్రీ, బ్లాక్ బెర్రీ వంటివి కూడా ప్రతికూల మానసిక స్థితిని పోగొడతాయి. హ్యాపీనెస్‌ను పెంచుతాయి.

PRINTED, PUBLISHED &" and OWNER By:KASHAMOLLAVIJAYKUMAR," And Published At 5-234, RAMANDIR ROAD, PATANCHERU, SANGAREDDY, TELANGANA-502319 And PRINTED at M/S LASRITHASAI PUBLICATION DOOR NO.: 2-369-1, REVENUE WARD NO: 02, EEDGAROAD, NEAR RTC BUS STAND, PENUKONDA(TOWN & POST), PENUKONDAMANDAL, ANANTHAPUR, ANDHRAPRADESH-515110., "Email ID," Kashamollavijaykumar@gmailcom " Editor & Pro KASHAMOLLA VIJAYKUMARR.N.I. NO: TGTEL/26/A5230 MOBILE NUMBER: 9912159120